ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 12 ఆగస్టు 2025 | 5

'గణపతి ఉత్సవాల అనుమతులకు సింగిల్‌విండో సెల్'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాల నిర్వహించుకునేందుకు అనుమతుల జారీ కోసం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సింగిల్ విండో సెల్ ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సవ కమిటీలు దీని ద్వారా అనుమతులు పొందాలని కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం పోలీస్, రెవెన్యూ, ఫైర్, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు, నగరపాలకసంస్థ విభాగాధిపతులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెండో అంతస్తులోని పట్టణ ప్రణాళిక విభాగంలో ఈనెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించేలా నిర్ణయించారు.

25 టన్నుల రేషన్ బియ్యం లారీ స్వాధీనం

» నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా పట్టివేత

దొంగల ముఠా ఆటకట్టు!

» నలుగురి అరెస్ట్ » రూ.45 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

» వివరాలు వెల్లడించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

7



9వ డివిజన్‌లో ఐఎంఏ హాల్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

'ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి' చొరవతో
సమస్యలకు మోక్షం

» 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'కు స్పందన

» నేటి సాయంత్రం 4 గంటలకు రాజమహేంద్రవరం 9వ డివిజన్‌లో సభ

» ముఖ్య అతిథిగా హాజరుకానున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

» రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు తదితర సమస్యలకు పరిష్కారం

రాజమహేంద్రవరం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రజల సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం చక్కటి ఫలితాలను ఇచ్చింది. 'అక్షరమే అండా.. పరిష్కారమే అజెండాగా' అనే నినాదంతో ఈ ఏడాది జనవరి 28వ తేదీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో శ్రీవేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో ప్రజల సమక్షంలో సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తోపాటు 9వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చండీప్రియ, పలువురు మున్సిపల్ అధికారులు, స్థానిక పెద్దలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా 9వ డివిజన్ పరిధిలో నివసించే అనేకమంది సభకు వచ్చి అపరిష్కృతంగా ఉన్న తమ ప్రాంత సమస్యలు ఏకరవుపెట్టారు. మాజీ కార్పొరేటర్ చండీప్రియ కూడా అక్కడి సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇవన్నీ విన్న ఎమ్మెల్యే వాసు కొద్దిరోజుల్లో ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధ్వానంగా ఉన్న పారిశుధ్య సమస్య అప్పటికప్పుడే పరిష్కారమైంది. విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారమైంది. వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావస్తోంది. అప్పట్లో కల్వర్టుల పేరుతో నెమ్మదిగా జరుగుతున్న పనులన్నీ పూర్తయ్యాయి. అవేకాక జేఎన్ రోడ్డు అధ్వాన పరిస్థితి చక్కబడింది. సుమారు రూ.10 కోట్లతో 32 ముఖ్యమైన పనులు పూర్తయ్యాయి. అందులో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పార్కులు ఉన్నాయి. వైసీపీ హయాంలో కోర్టు లిటిగేషన్‌తో ఆగిపోయిన ఐఎంఏ హాల్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. వేంకటేశ్వరనగర్ పార్కు కింది భాగంలో మాస్టర్ ప్లాన్‌ను మార్చేసిన సమస్య ఇంకా పెండింగ్‌లో ఉంది. దానిపై ఇటీవల కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి వేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం సాయంకాలం 4 గంటలకు సక్సెస్ మీట్ ఏర్పాటుచేసింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరుకానున్నారు.



స్త్రీశక్తికి తుది కసరత్తు!

» జీవో, మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

» బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్

» టిక్కెట్ ఇష్యూయింగ్ మెషీన్ల (టిమ్స్)లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీ టికెట్ (డబ్ల్యుఎఫ్‌టీ) బటన్

» ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ పథకం షురూ

» రాజమహేంద్రవరం- కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులకు వర్తించదు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించిన 'స్త్రీశక్తి పథకం' అమలుకు తుదికసరత్తు జరుగుతోంది. ఈమేరకు సోమవారం విజయవాడలో ఆయా జిల్లాల ప్రజారవాణా అధికారులతో ఆర్టీసీ ఉన్నతాధికారులు సమావేశమై మార్గనిర్దేశం చేశారు. తూర్పుగోదావరి జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు విధి విధానాలకు సంబంధించిన జీఓ, మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. అయితే, నాన్‌స్టాప్ సర్వీసుల్లో ఈ పథకం వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొనడంతో రాజమహేంద్రవరం-కాకినాడ మధ్య నడిచే నాన్‌స్టాప్ సర్వీసుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అనుమతించరు. అదేవిధంగా ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, సప్తగిరి, ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదని, నాన్‌స్టాప్ సర్వీసులు, స్పెషల్ బస్సులు, అంతర్రాష్ట్ర సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణం ఉండదని ప్రభుత్వం పేర్కొంది.

జిల్లాలో.. ఈ బస్సుల్లోనే ప్రయాణం..

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోలు ఉన్నాయి. ఈ నాలుగు డిపోల పరిధిలో మొత్తం 205 ఆర్టీసీ సొంత బస్సులు, 78 అద్దె బస్సులు నడుపుతున్నారు. వీటిలో ఆర్టీసీ, అద్దె బస్సులు కలిపి .. జిల్లాలో 37 ఎక్స్‌ప్రెస్‌లు, 27 ఆల్ట్రా పల్లెవెలుగు, 167 పల్లెవెలుగు బస్సులు స్త్రీ శక్తి పథకంలో మహిళలు ఉచితంగా రాకపోకలు సాగించనున్నారు. డిపోల వారీగా చూస్తే రాజమహేంద్రవరం డిపోలో 22 ఎక్స్‌ప్రెస్‌లు, 15 ఆల్ట్రా పల్లెవెలుగు, 64 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. గోకవరం డిపోలో 14 ఎక్స్‌ప్రెస్‌లు, 12 ఆల్ట్రా పల్లెవెలుగు, 30 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. కొవ్వూరు డిపోలో ఒక ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. 42 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. నిడదవోలు డిపోలో కేవలం 31 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ఇక స్త్రీశక్తి పథకం అమలులో ఎటువంటి గందరగోళానికి తావులేకుండా టిక్కెట్లు జారీచేసే మెషీన్ (టిమ్స్)లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీటిక్కెట్ (డబ్ల్యుఎఫ్‌టీ)పేరిట ప్రత్యేకంగా ఒక బటన్ ఏర్పాటు చేశారు. బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడానికి ఈ ఒక్క బటన్ ప్రెస్ చేస్తే చాలు ప్రింటెడ్ టిక్కెట్ బయటకు వస్తుంది. పురుషులకు మాత్రం గతంలో మాదిరిగానే ప్రయాణ దూరానికి అనుగుణంగా ఛార్జీలను నిర్దేశించి టిక్కెట్లు ఇస్తారు.



రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో సిద్ధమవుతున్న బస్సులు

టిక్కెట్లపై స్త్రీశక్తి.. జీరో టిక్కెట్ ముద్రణ

ముందు ఊహించినట్టుగానే మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్ జారీ చేస్తారు. అయితే దీనిలో చిన్న మార్పులు చేశారు. బాలికలు, స్త్రీలకు ఇచ్చే స్త్రీ శక్తి టిక్కెట్లపై తాము ప్రయాణించే దూరానికి టిక్కెట్ చార్జీ ఎంతవుతుందో ఆ మొత్తం ముద్రించి ఉంటుంది. దానికింద ప్రభుత్వ రాయితీ అంతే మొత్తం పేర్కొంటారు. చివరన టిక్కెట్ చార్జీ జీరోగా చూపిస్తారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి తాము ఎంత లబ్ధిపొందామనేది మహిళలు తెలుసుకుంటారని భావిస్తున్నారు.

అర్హులైన వారందరికీ జీరో ఫేర్ టిక్కెట్..



వయస్సుతో నిమిత్తం లేకుండా అర్హులైన అర్హులైన ప్రతి బాలిక, మహిళ, ట్రాన్స్‌జెండర్ స్త్రీశక్తి పథకంలో జీరో ఫేర్ టిక్కెట్ ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం సాగించవచ్చు. టిక్కెట్ తీసుకునే సమయంలో ఆర్టీసీ సిబ్బందికి తగిన గుర్తింపుకార్డు చూపించి జీరో టిక్కెట్ పొందాలి. భార్యాభర్తలు, పిల్లలు ప్రయాణించే సమయంలో వారికి వేర్వేరుగా టిక్కెట్టు ఇవ్వడం జరుగుతుంది. బాలికలు, మహిళలకు జీరో టిక్కెట్, బాలురు, పిల్లలకు ప్రయాణ చార్జీతో కూడిన టిక్కెట్ జారీచేస్తాం. టిక్కెట్ల జారీకి సంబంధించి ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఆర్టీసీ సిబ్బందికి ఇప్పటికే తగిన అవగాహన కల్పించాం. శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ పథకం అమలుచేస్తాం. ఆ రోజు ఏ సమయం నుంచి అనేది మార్గదర్శకాల మేరకు ఉంటుంది.

- వైఎస్ఎన్ మూర్తి, తూర్పుగోదావరి జిల్లా ప్రజారవాణా అధికారి



లక్ష్మీలావణ్యకు ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కృషి పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా విజయమే : కలెక్టర్

ఓపెన్ స్కూల్ టెన్త్‌లో ప్రథమ శ్రేణిలో పాసైన దివ్యాంగురాలికి అభినందన

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కృషి పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా విజయం సాధించవచ్చని, దీనికి తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు లక్ష్మీ లావణ్య వంటి వారే ప్రత్యక్ష సాక్షమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఇటీవల జరిగిన ఏపీ అమరావతి ఓపెన్‌స్కూల్ (సార్వత్రిక పీఠం) పదో తరగతి వార్షిక పరీక్షల్లో 500 మార్కులకుగాను 345 మార్కులు (69 శాతం) సాధించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. దీనికి సంబంధించిన ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని లక్ష్మీ లావణ్యకు కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. ఆ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లావణ్య చదువు కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. ఆమెకు ప్రభుత్వం ద్వారా ప్రతి నెలా రూ.15వేల పెన్షన్ అందించనున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షించిన పీ-4 కార్యక్రమంలో ఆటువంటి కార్యక్రమాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. తనకు అన్నివిధాలా అండగా నిలిచి ప్రోత్సాహం అందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్ ప్రశాంతి, డీఈవో వాసుదేవరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

వైద్య సేవలు మరింత మెరుగుపడాలంటే..

ఈ పోస్టులివ్వండి సారూ..

» నెఫ్రాలజిస్ట్, కార్డియాలజిస్ట్ పోస్టులు ఖాళీ.. ఔట్‌సోర్సింగ్‌లో రేడియాలజిస్ట్ సేవలు

» పిడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీకి వైద్యుల నియామకమూ అవసరమే

» వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడు రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో కీలకమైన ప్రధాన విభాగాలకు వైద్యుల కొరత వేధిస్తోంది. మెడికల్ కాలేజీకి జీజీహెచ్ అనుసంధంగా ఉన్నా కొన్ని కీలకమైన విభాగాలకు వైద్యులను నియమించకపోవడం వైద్యసేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా కార్డియాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యవసర వైద్యసేవల్లో కార్డియాలజిస్ట్ పాత్ర ఎంతో కీలకం. ఇటీవలి కాలంలో గుండె సంబంధిత వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్నవారు పెద్దసంఖ్యలోనే ఉంటున్నారు. వీరికి జనరల్ మెడిసిన్ వైద్యులే గుండె సంబంధిత వైద్యం చేస్తున్నారు. గుండె నెప్పితో వస్తున్న వారికి ఈసీజీ, 2డీ ఎకో వంటి టెస్టులు రాసి, వాటి రిపోర్టులు చూసి మందులు రాసి పంపేస్తున్నారు. రిపోర్టుల్లో లోతైన పరిశీలన, ఇతర కారణాలను వారు పరిగణలోకి తీసుకోవడంలేదు. దీంతో కార్డియాక్ వైద్యసేవలు తూతూ మంత్రంగానే జరుగుతున్నాయి. అలాగే కీలకమైన కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్యం చేసే నెఫ్రాలజిస్ట్ ఇక్కడ లేరు. కిడ్నీ సమస్య వస్తే ఎవరికి చూపించుకోవాలో తెలియని అయోమయం జీజీహెచ్‌లో ఉంది. సర్వరోగాలకు ఒకటే మంత్రం అన్నట్టు అందరూ జనరల్ మెడిసిన్ వైద్యుల వద్దకే వెళ్లాల్సి వస్తోంది. మరోపక్క రోగ నిర్ధారణలో అత్యంత కీలకమైన రేడియాలజిస్ట్ సేవలను ఔట్‌సోర్సింగ్‌లో మాత్రమే అందుతున్నాయి. శాశ్వత రేడియాలజిస్ట్ లేకపోవడంతో సమయానికి రిపోర్టులు అందడంలేదనే అసంతృప్తి రోగులు, వారి కుటుంబీకుల్లో వ్యక్తమవుతోంది. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఆల్ట్రా సౌండ్ వంటి పరీక్షల్లో రేడియాలజిస్ట్ నివేదిక వైద్యుడికి అత్యంత కీలకం అన్న విషయం తెలిసినా శాశ్వత రేడియాలజిస్ట్ నియామకంపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారించడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే జీజీహెచ్‌లోని పిడియాట్రిక్ విభాగంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వీటికి సంబంధించిన విభాగాలను మంగళవారం ప్రారంభిస్తున్నారు. అయితే పిడియాట్రిక్ విభాగంలో వైద్యులున్నా సూపర్‌స్పెషాలిటీ వైద్యులు ప్రస్తుతం లేరు. కొత్తగా నియామకం చేపట్టాలి. అప్పుడే ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు వైద్యసేవల్లో నాణ్యత పెరగాలంటే ప్రధాన విభాగాల్లో వైద్యులు, సాంకేతిక నిపుణులను నియమించాల్సి ఉంది.

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన ఇలా..

రాజమహేంద్రవరం అర్బన్/ రంగంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 7.30 గంటలకు మంగళగిరి నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి 10 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారు. అనంతరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటికి వెళతారు. అక్కడి నుంచి బయలుదేరి 10.25 గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకుని ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాకులో కొత్తగా ఏర్పాటుచేసిన ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ -1, ఎస్ఎన్‌సీయూ-2, పీఐసీయూ విభాగాలను ప్రారంభిస్తారు. తర్వాత వడిశలేరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొంటారు. సీసీ రోడ్డు శంకుస్థాపన, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణీలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి రాజానగరం చేరుకుని పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 3 గంటలకు జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల సముదాయాన్ని ప్రారంభించి, సుశ్రుత ఆడిటోరియంలో జరిగే ప్రపంచ అవయవదాన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు కొవ్వూరు చేరుకుని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నివాసానికి వెళ్లి, ఆ తర్వాత మంగళగిరికి బయలుదేరి వెళతారు.



హర్‌ఘర్ తిరంగా మెగా ప్రచార ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జాతీయ సమైక్యతను చాటేలా హర్‌ఘర్ తిరంగా : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. హర్‌ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం వై.జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ ఆర్ఎంసీ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులతో మెగా ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ముందుగా పోస్టర్‌ను కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. యువతలో దేశభక్తి పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగా, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి కార్యక్రమాలు అమలుచేస్తున్నట్టు పేర్కొన్నారు. జేసీ చిన్నరాముడు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజ వల్లి పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యజ్ఞం...

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలననుసరించి, దేశభక్తి భావాన్ని ప్రతి పౌరునిలో ప్రేరేపించేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆగస్టు 15 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. హర్‌ఘర్ తిరంగా కేవలం ఒక కార్యక్రమం కాదని, ప్రతి మనసులో జాతీయ గౌరవాన్ని నాటే ప్రజా సంకల్ప యజ్ఞమని అన్నారు. కలెక్టరేట్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంపై అధికారులకు సోమవారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయ స్థాయి వరకు జాతీయ పతాకాన్ని గౌరవించే చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 157 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తోందని, అర్జీలను నిర్దిత గడువులో నాణ్యతతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 157 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను ఓర్పుతో విని మర్యాదపూర్వకంగా స్పందించాలన్నారు. పరిష్కరించగల అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించలేని వాటికి కారణాలు వివరించి అర్జీదారులకు తెలియజేయాలన్నారు. మండలాల వారీగా రోజువారీగా ఫిర్యాదుల తీరును సమీక్షించాలన్నారు. గ్రీవెన్స్ ఎక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీపై ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. సోమవారం నిర్వహించిన అర్జీలలో రెవెన్యూకి సంబంధించి 71, పంచాయతీరాజ్‌కి సంబంధించి 43, విద్యుత్‌శాఖకు సంబంధించి 7, విద్యారంగానికి చెందినవి 5, పోలీస్, పురపాలక శాఖలకు చెందినవి 31 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా కోరుకొండ మండలం కాపవరం గ్రామ పంచాయతీ గణేష్ నగర్ కాలనీవాసులు సుమారు 60 మంది బైపాస్ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.



జిల్లా కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు తదితరులు



జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

ఎస్పీ గ్రీవెన్స్‌కి 31 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 31 ఫిర్యాదులను జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. వారి సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషను బాధ్యులకు ఫోన్ చేసి తగు ఆదేశాలిచ్చారు. చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఎల్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, వినయం, నిజాయితీలపై అవగాహన కల్పించడం, కుటుంబ విలువల ప్రాముఖ్యతను వివరించి వారిని సంస్కారంతో కూడిన విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు విలువల విద్య పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిని విద్యార్థులకు అందించడమే కాక ప్రతిరోజూ ఒక పీరియడ్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. నో బ్యాగ్ డే రోజున ఇదే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా సూచనలు ఇచ్చారు.



చాగంటి వారి వాగ్భూషణం

- విద్యార్థులకు నైతిక విలువలు, వినయం, నిజాయితీలపై అవగాహన
- కుటుంబ విలువల ప్రాముఖ్యతను చాటిచెప్పేలా పాఠాలు
- 6 నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేకంగా పాఠ్య పుస్తకాలు
- ప్రతిరోజూ ఒక పీరియడ్ కేటాయింపు
- నోబ్యాగ్ డే రోజున విలువలపై కార్యక్రమాలు
- ఇవన్నీ ఎన్‌సీఈఆర్‌టీ దీక్ష యాప్‌లో
- క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పాఠాలు, వీడియోలు అందుబాటులోకి

DIKSHA - for School Education NCERT



చిన్న మాట- ప్రతిజ్ఞ

6 నుంచి 10వ తరగతి వరకు గల విలువల విద్య పుస్తకాల కవర్ పేజీ లోపలి భాగంలో ప్రభుత్వ గౌరవ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు చిన్న మాట ఉంది. 'విద్య అమూల్య ధనము.. విద్యావంతులు గొప్ప అధికార స్థానాలను పొందుతారు... తద్వారా సమాజ హితానికి ప్రయత్నించడం సులభం' అని ఆయన చెప్పారు. విద్య సంస్కారాన్ని అందిస్తోందని, నైతిక విలువలు, వినయం, నిజాయితీ, కుటుంబ విలువలు తెలియకుంటే విద్యార్థులు విద్యావంతులు కాగలరు కానీ సంస్కారవంతులు అగుట కష్టమని అందులో వివరించారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు సీఎం చంద్రబాబు సూచన మేరకు ఈ పుస్తకాలను రూపొందించినట్టు తెలిపారు. కవర్ చివరి పేజీ లోపల ప్రతిజ్ఞ పేరుతో దేశాన్ని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,



పెద్దలు అందరినీ గౌరవిస్తానని విద్యార్థులతో చేయించాల్సిన అంశాలు ఉన్నాయి.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)


విద్యా రంగంలో మార్పులకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పలు కొత్త అంశాలకు శ్రీకారం చుట్టింది. పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్చింది. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు నైతిక, కుటుంబ విలువలు, వినయం, నిజాయితీ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా 'విలువల విద్య' పేరుతో ఒక పుస్తకాన్ని రూపొందించే బాధ్యతను ప్రభుత్వ నైతిక విలువల సలహదారు చాగంటి కోటేశ్వరరావుకు అప్పగించారు. ఇందుకోసం విద్యార్థులకు సంస్కారవంతమైన విషయాలపై అవగాహన కల్పించే విధంగా కొన్ని పాఠ్యాంశాలు, శతక సాహిత్యంలోని పద్యాలతో పొందుపరిచి 6 నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రూపొందించారు. వీటిని ప్రభుత్వం ముద్రించి ఇప్పటికే పాఠశాలలకు అందజేసింది. ప్రస్తుతం విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు.

ప్రత్యేకంగా పిరియడ్

విలువల విద్య పుస్తకాలను అందించడమే గాక వీటిని బోధించేందుకు ప్రతిరోజూ ఒక పీరియడ్ కేటాయించారు. ఆ పీరియడ్‌లో ఇందులోని అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. ప్రతి మూడవ శనివారాన్ని అన్ని పాఠశాలలు నో బ్యాగ్ డే గా పాటించాలన్న ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా విలువల విద్య పుస్తకంలోని అంశాలను కథల రూపంలో విద్యార్థులతో చెప్పించడం, చిన్నచిన్న స్కిట్స్ రూపంలో వాటిని ప్రదర్శించడం, అందులో పద్యాలు చదివించడం వంటి కార్యక్రమాలను నో బ్యాగ్ డే రోజున చేయనున్నారు.

స్కాన్ చేస్తే చాలు

విలువల విద్య కవర్ పేజీ నుంచి ప్రతి పాఠ్యాంశంపై ఒక క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచారు. ఈ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయగానే దీక్ష వెబ్‌సైట్‌కి వెళ్లి ఆ పాఠ్యాంశం మనకు



కనిపిస్తుంది. దీక్ష యాప్‌లో అయితే ఆ పాఠ్యాంశాన్ని డౌన్‌లోడ్ చేయడంతో పాటు అందుకు సంబంధించిన వీడియోలు ఉంటే ప్లే చేసుకోవచ్చు. ఇందునిమిత్తం ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో టీవీలు అందుబాటులో ఉన్నందున పాఠాలను వీడియోల రూపంలో ప్రదర్శించేందుకు ప్రయత్నించాలని సూచనలు జారీ అయ్యాయి.

విలువల విద్యలో అంశాల ద్వారా విద్యార్థుల్లో మంచి మార్పు వచ్చి సంస్కారంతో కూడిన విద్యావంతులుగా తయారు కావాలనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తేవడం మంచి పరిణామమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన పెంచేందుకు దోహదం

బి.వెంకట శివప్రసాద్, ఎంఈవో-2, గొల్లప్రోలు



విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు విలువల విద్య పుస్తకాలు దోహదం చేస్తాయి. ప్రతిరోజూ ఒక పిరియడ్‌ను విలువల విద్యకు కేటాయించారు. 6 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. పలు అంశాలను ఉదాహరణలతో వివరించారు. ప్రముఖులు చెప్పిన మాటలు, వారి జీవితంలో ముఖ్య ఘటనలను పొందుపరిచారు. ఈ పుస్తకాల్లో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.



6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న 'విలువల విద్య' పాఠ్య పుస్తకాలకు ప్రత్యేకంగా పేర్లు పెట్టారు.

తోరణం (6వ తరగతి): ఇందులో సాయం చేద్దాం, యోగ్యతకే అధికారం, సాటిలేని మేటి, నడత, గుణము, చిన్ననాటి నుంచి పాఠ్యాంశాలు ఉన్నాయి. డొక్కా సీతమ్మ చేసిన నిత్యాన్నదానం గురించి, కష్టపడి పనిచేసే స్వభావం అలవర్చుకోవడం, స్వభావరీత్యా చెడ్డవారైన వ్యక్తులను గౌరవించి సత్కరిస్తే ఏమి జరుగుతుంది, వివిధ రంగాల ప్రముఖుల చిన్ననాటి సంగతులను వివరించారు.

మనోవికాసం (7వ తరగతి): నిషిద్ధం, దృష్టికోణం, సుజనుడు, కుటుంబ విలువలు, దివ్యాంగులకు చేయూత, దృఢ చిత్తం పాఠ్యాంశాలతో పాటు కొందరు ప్రముఖుల జీవిత చరిత్రల్లోని ముఖ్యాంశాలు, వారు చెప్పిన సూక్తులను పొందుపరిచారు.

సూక్తిసుధ (8వ తరగతి): ఓర్పుతో విజయం, అందమైన అలవాటు, సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గుణాలు, గౌరవం పాఠ్యాంశాలు

సద్గుణసారం (9వ తరగతి): కోపం-శాంతం, వాగ్భూషణం, సార్థకత, నాయకత్వం, అభివృదిపథం, తస్మాత్ జాగ్రత్త ఇందులో పాఠ్యాంశాలు

అమృతధార (పదో తరగతి): విద్య-విలువ, సజ్జన సహవాసం, కీర్తి శరీరం, సహజ గుణాలు, నిందచెందకు, మాటతూలకు ఇందులోని పాఠ్యాంశాలు ఉన్నాయి.



మగ్గంపై నేసిన టస్సార్ పట్టు చీరను ప్రదర్శిస్తున్న గిరిజన మహిళలు

శభాష్

- టస్సార్ పట్టు చీరలు బాగున్నాయి
- గిరిజన మహిళలకు సీఎం చంద్రబాబు ప్రశంస



పైడిగూడెంలో టస్సార్ పట్టు చీరలు తయారు చేస్తున్న గిరిజన మహిళలు

కూనవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని పైడిగూడెంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న టస్సార్ పట్టు చీరలు బాగున్నాయంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు మండలం వంజంగి గ్రామంలో ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో ఈ పట్టు చీరలను ప్రదర్శించారు. పట్టు చీరలను మాత్రమే గిరిజను మహిళలు తయారు చేస్తున్నారని ప్రింటింగ్, డిజైన్ వర్కులను బయట చేయించాల్సి వస్తోందని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రింటింగ్, డిజైన్ వర్కుల్లో కూడా గిరిజన మహిళలకు శిక్షణ ఇవ్వాలని, వాటికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు తెలిసింది. నాణ్యమైన పట్టుచీరలు కాబట్టి వీటికి డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. గిరిజన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించడంలో శ్రద్ధ చూపిన చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే తొలిసారిగా కూనవరం మండలం పైడిగూడెంలో టస్సార్ పట్టుచీరల తయారీలో గిరిజన మహిళలకు శిక్షణ ఇచ్చారు. అంతకు ముందు ఇక్కడి గిరిజన మహిళలకు పట్టుకాయల నుంచి దారం ఎలా తీయాలో నేర్పారు. అనంతరం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మగ్గాలపై పట్టుచీరల తయారీలో శిక్షణ ఇచ్చారు. స్థానికంగా అడవుల్లో పండించే పట్టుతోనే ఇక్కడ చీరలు తయారుచేస్తున్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని అడవుల్లో సుమారు 4వేల హెక్టార్లల్లో గల మద్ది చెట్లపై గిరిజనులు టస్సార్ పట్టు పురుగుల సాగు చేస్తుంటారు. తద్వారా సుమారు 1,600 మంది రైతులు, వెయ్యి కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. జూన్ నుంచి డిసెంబరు వరకు మూడు దఫాలుగా పట్టు పురుగుల సాగు చేస్తారు. ఒక్కో కుటుంబం రూ.40వేలు వరకు ఆదాయం పొందుతుంది. అధిక దిగుబడి వస్తే రూ.లక్ష కూడా వస్తుంది.



టస్సార్ పట్టు చీరలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ఫైల్)

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్

- విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్
- శ్రీప్రకాష్‌లో ముగిసిన అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత విజయప్రకాష్

తునిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):గత మూడు రోజులుగా శ్రీప్రకాష్ విద్యా సంస్థలలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 తెలుగు రాష్ట్రాల బాలబాలికల క్రీడాపోటీలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు ఉత్సవంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 180కిపైగా జట్లు, 2000 మంది క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మూడు రోజుల నుంచి సుదూర ప్రాంతాల నుంచి గెలుపే లక్ష్యంగా ఆడి గెలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు నిత్యం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందుతారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు సీహెచ్ ఎల్ఎం శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి. ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎం.అపర్ణ, వివిధ ప్రాంతాలనుంచి హాజరైన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో హాకీ టైటిల్ వార్

- ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ రాక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ కోర్టు వేదికగా జరుగుతున్న 15వ హాకీ ఇండియా జూనియర్ నేషనల్ ఉమెన్ హాకీ ఛాంపియన్షిప్ - 2025 పోటీల క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ ముగించుకుని టైటిల్ వార్‌కి రంగం సిద్ధమయ్యింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూడోస్థానం కోసం ఉత్తరప్రదేశ్ వర్సెస్ ఛత్తీస్‌ఘడ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అనంతరం మూడు గంటలకు టైటిల్ పోరుకు మిగిలిన రెండు జట్లు పోటీపడునున్నాయి. ఈ పోరు ముగిసిన తదనతరం బహుమతి ప్రదానోత్సవానికి కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందుమాధవ్, జేసీ రాహుల్ మీనా, తదితరులు హాజరుకానున్నారు. ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన హాకీ ఛాంపియన్షిప్‌లో 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చి పాల్గొన్నారు. దీంతో కాకినాడ పరిసర ప్రాంతాలు క్రీడాకారులతో సందడిగా మారాయి.

హాకీకి పెరిగిన ఆదరణ..

కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో ఆస్ట్రోటర్ఫ్ కోర్టులో జరుగుతున్న హాకీ ఛాంపియన్షిప్‌కి తగిన సౌకర్యాలు కల్పించారు. మన జాతీయ క్రీడా హాకీ కావడంతో స్కూల్, కాలేజ్ విద్యార్థులు సైతం మ్యాచ్‌లను చూసేందుకు తరలి రావడం ఇందుకు నిదర్శనం.

ఇప్పటికే నాలుగు జాతీయ స్థాయి పోటీలు జరగాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయం టోర్నమెంట్లు కూడా నిర్వహించుకునేలా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కలెక్టర్ చొరవచూపడంతో అవకాశాలు మెరుగుపడుతున్నాయి.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు పెద్దాపురం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఈనెల 27 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకినాడ జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతిలో జరిగిన ఎంపికల్లో తెప్పల యోగేష్, సహస్ర, పాశిల లోకేష్ అర్హత సాధించారు. వీరిని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, దుండల పూజిత, సూర్యశ్రీ అభినందించారు.

3.14 లక్షల మంది పిల్లలకు

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

- జేడీ డాక్టర్ మల్లేశ్వరి



ద్రాక్షారామలో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జేడీ డాక్టర్ మల్లేశ్వరి

ద్రాక్షారామ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డా.బి. ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లాలో 314930 మం ది పిల్లలకు ఆగస్టు 12న ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని లక్ష్యంగా పెట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అమరావతి కార్యాలయ జేడీ డా.ఎస్.మల్లేశ్వరి తెలిపారు. సోమవారం ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు నమిలిమింగేటట్లు చూడాలన్నారు. జిల్లాలో 1726 అంగన్‌వాడీ కేంద్రాలు, 1582 ప్రభుత్వ పాఠశాలలు, 480 ప్రైవేటు పాఠశాలలు, 53 టెక్నికల్ అండ్ నాన్‌టెక్నికల్ కళాశాలల్లో 314930 మంది పిల్లలకు మాత్రలు మింగిస్తున్నామన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు రక్తహీనతను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఆవశ్యకత గురించి తెలిపారు. అనంతరం మండాలమ్మపేట స్కూల్, అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్ఈవో హరి వెంకటేశ్వర్లు, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యులు డా.రత్నసుధ, జి.కమలశేషు, డివిజనల్ సూపర్‌వైజర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు జానకమ్మ, వరలక్ష్మీ, శ్రీనివాస్, ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫిబా ఆసియా ఉమెన్ కప్ పోటీలకు రిఫరీగా

రామచంద్రపురం క్రీడాకారుడు

- ఈనెల 13నుంచి మలేషియాలో మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు



డి.డేవిడ్‌రాజు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరుగనున్న ఫిబా ఆసియా ఉమెన్‌కప్ బాస్కెట్ బాల్ పోటీలకు రామచంద్రపురానకు చెందిన సీనియర్ క్రీడాకారుడు ధర్నాలకోట డేవిడ్‌రాజు ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19 వరకు మలేషియాలో ఫిబా ఆసియా ఉమెన్‌కప్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయి. రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ క్రీడాకారుడు ధర్నాలకోట డేవిడ్‌రాజు రిఫరీగా ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు రిఫరీగా ఎంపికైన ధర్నాలకోట డేవిడ్‌రాజును గన్నమని చక్రవర్తి, డా.స్టాలిన్ అభినందించారు.

టీసీఐఎల్‌తో నన్నయ ఎంవోయూ

- నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న అధికారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉష) పథకంలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసే ల్యాబ్స్, సాంకేతిక సహకారం నిమిత్తం టెలీ కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్)తో ఎంవోయూ కుదుర్చుకున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం వీసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, టీసీఐఎల్ ప్రతినిధి ఆదిత్య అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈ ఎంవోయూలో ప్రధానంగా డిజిటల్ కంటెంట్ అభివృద్ధి, వ్యాప్తి చేస్తూ 24 కోర్సులకు ఈ-కంటెంట్‌తో సహా అధిక నాణ్యత డిజిటల్ అభ్యాసన వనరులను రూపొందించడానికి మూక్ లెక్చర్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేయడానికి సహకరిస్తారన్నారు. విశ్వవిద్యాలయంతో బాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులకు నైపుణ్యాలను వృద్ధి చేయడానికి స్వయం, మూక్ వంటి జాతీయ వేదికల ద్వారా డెలివరీని సులభతరం చేయవచ్చునని అన్నారు. అలాగే స్మార్ట్ లెర్నింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇంటరాక్టివ్ బోర్డులు, కంప్యూటర్ ప్రయోగశాలలు, హైస్పీడ్ వైఫై కనెక్టవిటీతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేస్తారని చెప్పారు. పాఠ్యాంశాలు, సహపాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మిశ్రమ అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత, కంటెంట్ సృష్టిని ప్రోత్సహిస్తారన్నారు. ఇంకా దీని ద్వారా కలిగే అనేక ప్రయోజనాలను వివరించారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ డిమాండ్‌లను తీర్చడానికి లైఫ్‌సైన్సెస్, జియో సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ, వ్యవసాయశాస్త్రాలతో సహా వివిధ విభాగాల్లో కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ అప్లికేషన్‌లను ఏకీకృతం చేయడానికి వీలవుతుందని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, పీఎం ఉష కోఆర్డినేటర్ కే.రమణేశ్వరి, ప్రాజెక్టు మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఆచార్య కే.శ్రీరమేష్, ఆచార్య డీ.జ్యోతిర్మయి, అధ్యాపకులు వీ.పెర్సిస్, పీ.విజయనిర్మల పాల్గొన్నారు.

దొంగల ముఠా ఆట కట్టు

- నలుగురి అరెస్ట్
- రూ.45 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- సీఐ బృందానికి రూ.50 వేల రివార్డు
- వివరాలు వెల్లడించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు


రాజమహేంద్రవరంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎలాగైనా దోపిడీ చేయడమే వారి లక్ష్యం. గ్యాంగ్‌గా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారు. వాకిట్లో కల్లాపు వేస్తున్న మహిళల మెడలోని ఆభరణాలు సైతం లాగేస్తారు. అద్దెకు తీసుకున్న కారులో తిరుగుతూ గేటుకు తాళం వేసి ఉన్న ఇళ్లపై పగలు రెక్కీ చేస్తారు. రాత్రి కన్నం వేస్తారు. మంచాలు, టీవీలను కూడా పట్టుకుపోతారు. చోరీ సొత్తును తాకట్టు పెట్టి లేదా అమ్మేసి ఆ డబ్బుతో విలాసాలు చేస్తారు. అలాంటి నలుగురి ఆట కట్టించారు పోలీసులు. రూ.45 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఈ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు పంచాయతీ భవానీపురానికి చెందిన గరిమెళ్ల పవన్‌శర్మ కుటుంబంతో గత నెల 15న శ్రీశైలం వెళ్లారు. 20న తిరిగి వచ్చేసరికి ఇంటి గేటు, తలుపు, బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.50 కిలోల వెండి వస్తువులు దోపిడీకి గురయ్యాయి. శర్మ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. దీనిపై ఎస్పీ నరసింహ కిషోర్ సీరియస్‌గా దృష్టి పెట్టారు. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో 10మందితో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు 15 రోజులు శ్రమించి చివరికి దొంగతో పాటు గ్యాంగ్‌ని కటకటాల్లోకి నెట్టారు. దర్యాప్తులో కొంతమూరు సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి హరీశ్ గ్యాంగ్ ఆ దొంగతనం చేసినట్టు గుర్తించారు. దర్యాప్తు ముమ్మరం చేసి కచ్చితమైన సమాచారంతో హరీశ్, అదే ప్రాంతానికి చెందిన మోర్త వెంకటేశ్ (వెంకీ), ఇంద్రపాలెనికి చెందిన తణుకు దర్గాప్రసాద్(సూర్య), తొర్రేడు టిడ్కో గృహ సముదాయానికి చెందిన బండి ధర్మరాజు(గాబ్రియెల్)ను సీఐ వీరయ్య గౌడ్ బృందం అరెస్టు చేసిందని సోమవారం ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అశోక్, రాజేశ్‌ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి చోరీ సొత్తు 301 గ్రాముల బంగారు ఆభరణాలు, 7కిలోల వెండి వస్తువులు, రూ.5 లక్షల నగదు, కారు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కంచు సామగ్రి, టీవీలు, మంచాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా సుమారు 150గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేయాల్సి ఉందన్నారు.

వయసు 34 కేసులు 40..

నిందితుల్లో హరీశ్ వయసు 34 కాగా 40 కేసులు, వెంకటేష్(36)పై 34, దుర్గాప్రసాద్(25)పై ఏడు, ధర్మరాజు(29)పై ఏడు కేసులు ఉన్నాయన్నారు. వీళ్లకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసి భారీగా చోరీ సొత్తును రికవరీ చేసిన సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐలు ప్రియకుమార్, ఏకే సత్యనారాయణ, నాగార్జున, క్రైం సిబ్బంది అమ్మిరాజు, సత్యనారాయణ, కరీం, బీవీ రమణ, సురేశ్, మురళీని ఎస్పీ అభినందించి రూ.50వేల ప్రత్యేక రివార్డును అందజేశారు.

కాకినాడలో సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి

సుబ్బయ్య హోటల్‌లో భోజనం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. పరదా చిత్రం ప్రచారం నిమిత్తం వచ్చిన ఆమె కాకినాడ నగరంలోని సుబ్బయ్య హోటల్‌లో భోజనం చేశారు. దీంతో ఆమెను చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు హోటల్‌కి తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా సినీనటి అనుపమ మాట్లాడుతూ సుబ్బయ్య హోటల్ భోజనం అంటే తనకి ఎంతో ఇష్టమని, అందుకే ఇక్కడ భోజనం చేసేందుకు వచ్చానని తెలిపారు.


సుబ్బయ్య హోటల్‌లో భోజనానికి వచ్చిన అనుపమ

స్కీమ్ పేరిట స్కామ్

రూ.1.20 కోట్ల వరకు కట్టించుకుని మోసం

కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు


కోటనందూరులో ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కోటనందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగారం, పొదుపు స్కీం పేరుతో మోసం జరిగిన ఘటన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరం గ్రామంలో జరిగింది. సుమారు రూ.1.20 కోట్ల వరకు బాధితులు నష్టపోయారు. వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, కుమారులు నారాయణరావు, శ్రీనివాస్ కాకినాడ జిల్లా తుని నక్కినవీధిలో శ్రీశ్రీనివాస జ్యూయలర్ షాపు నడుపుతుండేవారు. వారి వద్ద పలువురు బంగారు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుండేవారు. ఈ పరిచయాన్ని అసరాగా చేసుకుని మహిళలను స్కీం వలలోకి లాగారు. బొద్దవరం గ్రామంలోని పలువురు మహిళల నుంచి నెలనెల సొమ్ములు వసూలు చేసేవారు. సుమారు 36 మంది మహిళలు స్కీంలో చేరి నెలనెల సొమ్ములు కడుతుండేవారు. సుమారు 10 ఏళ్ల నుంచి స్కీం వ్యవహారం సాగుతోంది. మొదట కొన్నేళ్లు సాఫీగానే సాగినా తరువాత స్కీమ్ డబ్బులు వసూళ్లకు రాకపోవడంతో ఆరా తీయగా తునిలో జ్యూయలరీ మూసివేసినట్టు తెలిసింది. వారి స్వగ్రామమైన పాయకరావుపేట మండలం సత్యవరంలో ఇంటికి వెళ్లగా చుట్టుపక్కలవారు నెల రోజుల పైగా ఇంటి వద్ద ఉండడంలేదని తెలిపారు. కూలీనాలీ చేసుకుని నెల నెల వాయిదాల రూపంలో సొమ్ములు కట్టేవారమని, ఇప్పుడు అర్థాంతంగా షాపు మూసివేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సోమవారం కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

లారీల చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- రూ.54.88 లక్షల విలువైన ఆయిల్‌ప్యాకెట్లు, నూకల నిల్వలు స్వాధీనం
- రెండు లారీలు, ట్రాక్టర్ సీజ్



నిందితుల అరెస్టు చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు, ట్రాక్టర్

పిఠాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సంచలనం కలిగించిన ఆయిల్‌ప్యాకెట్లు, నూకల లోడు లారీల చోరీ కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. రెండు లారీలు, ట్రాక్టర్‌తో పాటు చోరీకి గురైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పిఠాపురంలో సోమవారం సాయంత్రం విలేకర్లకు సీఐ జి.శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

పిఠాపురంలోని కుంతీమాధవస్వామి గుడి వద్ద ఈనెల 5న రాత్రి ఉంచిన లారీని రూ.26.83 లక్షల విలువైన ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ప్యాకెట్లతో సహా చోరీ చేసినట్టు కాకినాడకు చెందిన దగ్గు అప్పారావు ఈనెల 6న ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా డ్రైవర్స్ కాలనీ వద్ద ఉంచిన నూకల లోడు లారీని గుర్తు తెలియని ఆగంతుకులు దొంగలించినట్టు ఆకుల ప్రసాద్ ఫిర్యాదు చేయగా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో 2 కేసులను నమోదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు మణికుమార్, జానీభాషా, ఎస్.రామకృష్ణ, వెంకటేష్ ఆధ్వర్యంలో 5 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ సాగించారు. చేబ్రోలు నుంచి వజ్రకూటం వెళ్లే ఎలబంద పుంతరోడ్డులో యాల లక వారి గరువు వద్ద నిందితులు ఉన్నట్టు గుర్తించారు. అనంతరం పిఠాపురం పట్టణం బొజ్జావారితోటకు చెందిన బెల్లంకొండ రవితేజ, కోటగుమ్మం ప్రాంతానికి నాగిరెడ్డి నాగ సతీష్, లయస్క్లబ్ ఏరియాకు చెందిన గంజి సురేష్, పందూరుకు చెందిన శంఖవరం మండలం మండపంలో నివాసముంటున్న నందిపాటి వీరసుబ్రహ్మణ్యంలను అరెస్టు చేశారు. వారి నుంచి చోరీకి గురైన 2 లారీలు, సరుకు రవాణాకు వినియోగించిన ట్రాక్టర్, ట్రక్‌లు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు బాక్సులు, నూకలతో కూడిన కోళ్లమేత బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.54.88 లక్షలుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని, 63సన్‌ఫ్లవర్ ఆయిల్‌బ ండిల్స్ స్వాధీనం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. కాగా నిందితుల్లో ప్రధాన వ్యక్తిగా ఉన్న బెల్లంకొండ రవితేజ గతంలో కాకినాడ పోర్టు నుంచి బియ్యం లోడు లారీ చోరీ కేసులో నిందితుడిగా ఉన్నట్టు తెలిపారు.

నిందితులు... జనసేనతో సంబంధాలు!

అరెస్టయిన నిందితుల్లో ముగ్గురు జనసేన పార్టీకి చెందిన వారున్నట్టు చెప్తున్నారు. వీరిలో ఒకరు లారీ యూనియన్ పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగించారు. వీరు కొందరు జనసేన కీలక నేతలతో దిగిన ఫోటోలు సోష ల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పోలీసులు మాత్రం అధికారికంగా ధృవీకరించడం లేదు.

బైక్ ఢీకొని భార్య మృతి

భర్తకు స్వల్ప గాయాలు


మృతిచెందిన రాఘవ

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారి దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో గండేపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన జనపరెడ్డి రాఘవ(59) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్తకు స్వల్పగాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం గోపాలపురానికి చెందిన జనపరెడ్డి సత్యనారాయణ, తన భార్య రాఘవతో కలిసి మోపెడ్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన బైక్ వేగంగా ఢీకొంది. మోపెడ్‌పై వెనుక కూర్చున్న రాఘవ కిందపోయింది. ఆమె తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందిందని పోలీసులు తెలిపారు. సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయని, జనపరెడ్డి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆర్.మురళీమోహన్ పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని అక్క మృతి

బయటపడ్డ చెల్లెలు

కడియం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన చిక్కిరెడ్డి సరోజిని (28)మృతి చెందింది. వివరాలోకి వెళితే... కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన సరోజిని కడియం మేకల దిబ్బప్రాంతంలో ఉంటున్న చెల్లి జగతా బుజ్జి ఇంటికి వచ్చింది. ఆధార్‌కార్డుకు ఫోను నెంబర్ లింక్ చేయించుకునేందుకు ఇద్దరూ బ్యాంక్‌కు బయలుదేరారు. ఇద్దరూ నడిచి వస్తుండగా బుర్రిలంక నుంచి రాజమహేంద్రవరం వైపు వె ళ్తున్న టిప్పర్ ఢీకొంది. సరోజికి బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు కడియం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బుజ్జి సురక్షితంగా బయటపడింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్


నిందితులను పట్టుకున్న పోలీసులు

కాట్రేనికోన, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామ శివారులో గంజాయి సేవిస్తున్న వాసంశెట్టి సోమేశ్వర సాయిపవన్, పలివెల కార్తీక్, ముసలి తేజస్వరూప్, మోకా సంతోష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు. నిందితులను ముమ్మిడివరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 15 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

వాడపల్లి ఆలయానికి రూ.12 లక్షల విలువైన బ్యాటరీ కార్లు

ఆత్రేయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం జెఎస్ఎన్ రాజు కనస్ట్రక్షన్స్ ద్వారా రూ.12 లక్షల విలువైన బ్యాటరీ కార్లను అందజేశారు. ఈనెల 15న కార్లను ప్రారంభించడం జరుగుతుందని డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. దాతలను అభినందించారు.


ఆలయానికి అందించిన బ్యాటరీ కార్లు

రెండు కార్లు, వ్యాను ఢీ

నలుగురికి స్వల్ప గాయాలు


ధర్మవరం వద్ద ప్రమాదానికి గురైన కారు

ప్రత్తిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం 16 నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు కార్లు, ఐసర్ వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. ధర్మవరం జడ్పీ హైస్కూల్ హైవే క్రాసింగ్ రోడ్డు వద్ద తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న 2 చిన్న కార్లు నిలిపారు. అదే సమయంలో వాటి వెనుక తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఐసర్‌వ్యాన్ ఓ కారును బలంగా ఢీకొనడంతో వెనుక కారు ముందు కారును ఢీకొంది. దీంతో వెనుక కారులో ఉన్న నలుగురుకిరి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం వల్ల హైవేపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్.. ఏడుగురు విద్యార్థుల అరెస్టు

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా జీపును నడిపి కూల్‌డ్రింక్ షాపులోకి దూసుకెళ్లడమే కాకుండా 2 మోటారు సైకిళ్లను ధ్వంసం చేసిన కేసులో కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఏడుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు సోమవారం తెలిపారు. ఈనెల 9న ముక్కామల బైపాస్ రోడ్డులో విద్యార్థులు అతివేగంగా జీపును నడిపి 2 మోటారు సైకిళ్లను ఢీకొట్టి నేరుగా కూల్ డ్రింక్ షాపులోకి దూసుకుపోయారు. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదుతో పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు కేసు నమోదు చేశారు. నలుగురు మైనర్లతో పాటు ముగ్గురు మేజర్లయిన విద్యార్థులను అరెస్టు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

జగజ్జీవనరామ్ విగ్రహం పాక్షిక ధ్వంసం

అంబాజీపేట మండలంలో ఘటన

అంబాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి పరిధిలోని కాకరవారిపేటలో బాబూజగ్జీవనరామ్ విగ్రహం పాక్షికంగా ధ్వంసమైనట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ భీమరాజు, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో చర్చించి దర్యాప్తు చేపడతామని తెలిపారు. డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించారు. అనంతరం విగ్రహానికి మరమ్మతులు చేపట్టి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసినట్టు తెలిసింది. అయితే విషయం బయటకు వెళ్లకుండా ఇటు స్థానికులు, అటు పోలీసులు సమాచారాన్ని గోప్యంగా ఉంచారు.

25 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం లారీతో అధికారులు

రాజానగరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు రవాణా చేస్తుండగా విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు సోమవారం నిర్వహించిన తనిఖీల్లో పాలచర్లలో 25 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుబడినట్టు రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు చెప్పారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేశామని, రికార్డు పరిశీలన నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, పౌర సరఫరాలు వారికి నివేదిక సమర్పించనున్నట్టు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.11, 50,000 కాగా, లారీ విలువ రూ.10 లక్షలుగా అంచనా వేశామని, కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ వంట పాటి సురేంద్రను విచారించామన్నారు. తనిఖీల్లో రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ తహశీల్దార్, సహాయ పౌరసరఫరాల అధికారి తదితరులు ఉన్నారు.

బియ్యం బస్తాల చోరీకి యత్నం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కాటకూటేశ్వరంలోని గోడౌన్ల వద్ద ఆదివారం రాత్రి 100 కిలోల ఉండే 2 బియ్యం బస్తాలను వాచ్‌మెన్ దొంగిలించుకుపోతుండగా పట్టుకున్నారు. సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై మూకదాడి

వృద్ధుడి పరిస్థితి విషమం

అమలాపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇంటిపై ఖాళీ బీరు బాటిల్ విసిరాడన్న నెపంతో యువకుడి ఇంటిపై మూక దాడి చేశారు. యువకుడికి అడ్డుగా వెళ్లిన వృద్ధుడికి తలపై బలమైన గాయమై పరిస్థితి విషమంగా ఉంది. అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సోమవారం విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బండారులంక శివారు అరటి మామిడితోట ప్రాంతానికి చెందిన యువకుడైన ఇళ్ల సత్యగోపాల్, వాసంశెట్టి లక్ష్మి కుటుంబాల మధ్య కొంతకాలం క్రితం వివాదరం నెలకొంది. లక్ష్మి ఇంటిపైకి సత్యగోపాల్ బీరు బాటిల్ విసిరాడన్న నెపంతో ఆమె బంధు వర్గీయులు మూకదాడికి దిగారు. పక్కపక్కనే ఇళ్లు కావడంతో సత్యగోపాల్‌పై లక్ష్మి వర్గీయులు మూకదాడి చేయడంతో ఆ సమయంలో తాత గుత్తుల బాబూరావు (65) అడ్డుగా వెళ్లాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆదివారం రాత్రి తొలుత ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం ఉన్నత వైద్యం కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యగోపాల్, బాబూరావు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్యగోపాల్ ఫిర్యాదు మేరకు మూకదాడికి పాల్పడిన గొవ్వాల సతీష్, దొమ్మేటి మహేష్, గొవ్వాల నాగేంద్ర, గొవ్వాల నరేంద్ర, గొవ్వాల చైతన్య, గొవ్వాల అరుణ్, గొవ్వాల వెంకన్న, గొవ్వాల సత్తిబాబు, గొవ్వాల ఏసుబాబు, దొమ్మేటి షణ్ముఖరావు, వాసంశెట్టి లక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు. తనపై సత్యగోపాల్, మరికొందరు దాడికి పాల్పడినట్టు లక్ష్మి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు.

మస్కట్ నుంచి స్వగ్రామానికి..

కొత్తపేట మహిళ రాక

కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సిబ్బంది ఏర్పాట్లు


స్వదేశానికి వస్తున్న మరియమ్మ

అమలాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మస్కట్‌లో చిత్రహింసలు పడుతున్న తన భార్యను స్వదేశానికి తీసుకురావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన సాకా చంటి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు తక్షణం స్పందించారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించి సాకా మరియమ్మను మస్కట్ నుంచి స్వదేశానికి తీసుకురావడం జరిగిందని డీఆర్వో, కేంద్ర నోడల్ అధికారి కొత్త మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాకా చంటి ఇద్దరు పిల్లల చదువుకు ఆర్థిక స్థోమత లేని కారణంగా తన భార్యను విదేశాలకు పంపాలని నిర్ణయించుకున్నాడని తెలిపారు. కోటిపల్లికి చెందిన వ్యక్తి పరిచయమై కొంత సొమ్మును ఇచ్చి నీ భార్యను నేను విదేశాలకు పంపిస్తానని నమ్మబలికి 2 నెలల క్రితం హైదరాబాద్ నుంచి విమానం ఎక్కించారని, మస్కట్ దేశంలో ఒక ఇల్లు తరువాత మరో ఇంట్లోకి పనికి మార్చారని, భోజన వసతులు లేకపోవడంతో శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ సాకా మరియమ్మను పనిచేయించే వారని, ఫోన్ కూడా అందుబాటులో లేకుండా చేశారంటూ భర్త వాపోయాడు. ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా ఆమెను స్వగ్రామానికి తీసుకురావాలన్న కలెక్టర్ ఆదేశంతో కేసీఎం సెంటర్ ద్వారా సిబ్బంది మస్కట్‌కు పంపిన ఏజెంట్‌ను పిలిపించి ఇరుపక్షాలను కూర్చోబెట్టి సంప్రదింపులు జరిపి మరియమ్మను స్వదేశానికితీసుకొచ్చామని డీఆర్వో చెప్పారు.

పంటకాల్వలో వ్యక్తి మృతి


సత్యనారాయణ(ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లికి చెందిన కనికల వీర వెంకటసత్యనారాయణ(51) శనివారం సాయంత్రం పంటకాల్వలో తూర మారుస్తుండగా ప్రమాదవశాత్తూ మునిగి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెం వద్ద సుమారు 50 ఏళ్ల మహిళ మృతదేహం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో కొట్టుకొస్తుండగా స్థానికులు గుర్తించి ఒడ్డుకు తీశారు. దీనిపై సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

మామిడికుదురు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామానికి చెందిన అడ్డాల సూర్యావతి (64) ఈనెల 2న అదృశ్యమైంది. కాగా ఆమె మృతదేహం గోగన్నమఠం గ్రామంలో సోమవారం లభ్యమైంది. ఆమె మనుమడు చేపూరి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

కోటనందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. కోటనందూరుకు చెందిన పోటనూరి కా వ్యశ్రీ(19) ఈనెల 9న రాత్రి 7.30 గంటలకు ఇంటి నుంచి మెడికల్ షాపునకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో తండ్రి అప్పారావు కోటనందూరు పోలీ స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె మొబైల్ వాట్స్‌ప్‌ను పరిశీలించగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మాదవ్ గణేష్‌తో వెళ్లినట్లు అనుమానంగా ఉందన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కావ్యశ్రీ ఆచూకీ తెలిస్తే 8500811 240లో తెలియజేయాలని కోరారు.

ఆర్డీ.. హైస్కూల్స్, అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

రంగంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖమంత్రి వై.సత్యకుమార్ యాదవ్ మండలంలోని వడిశలేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రంగంపేట పీహెచ్‌సీ పరిధిలోని ఏర్పాట్లను పరిశీలించేందుకు రీజినల్ డైరెక్టర్ పద్మశశిధర్, అడిషనల్ డీఎంహెచ్‌వో పి.సరిత, జిల్లా ఇమ్యూనేషన్ అధికారి కోమల విచ్చేశారు. ఈ సందర్భంగా రంగంపేట పీహెచ్‌సీ, జూనియర్ కళాశాల, హైస్కూల్, వడిశలేరులో హైస్కూల్, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి, కె.చిన్నారావు, సిబ్బంది, హైస్కూల్ హెచ్.ఎంలు వి.పార్థసారథి, డి.అరుణ పాల్గొన్నారు.

కడియపులంక సర్పంచ్‌గా పద్మావతి ప్రమాణ స్వీకారం


పద్మావతితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి దుర్గేష్

కడియం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన మాదిశెట్టి పద్మావతి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. దీనికి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కూటమి నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీ ఈ ఎన్నిక ఏకగ్రీవం చేసినందుకు అభినందనలు తెలిపారు. తండ్రి మార్గాని ఏడుకొండలు సలహాలు, గ్రామస్థుల సూచనలు, అందరి సహాయ సహకారాలు తీసుకుని గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని పద్మావతికి మంత్రి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని లక్ష్మి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, చెక్కపల్లి మురళి, నాయకులు గట్టి నర్సయ్య, వెలుగుబంటి నాని, గట్టి సుబ్బారావు, ముద్రగడ జమీ, బొర్సు సుబ్రహ్మణ్యం నర్సరీ సంఘం నాయకులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాజా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయాల కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాయనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సమస్యలు బయటకు రానీయకుండా అణగదొక్కడానికే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసిందని భావిస్తున్నామని, తక్షణమే ఉపసంహరించుకోకపోతే ఈనెల 13న జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాపాక-కోటికేశవరం రోడ్డుకు శంకుస్థాపన


రాఘవాపురంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపాక -కోటికేశవరం రోడ్డుకు సోమవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి శంకుస్థాపన చేశారు. రాజమహేంద్రవరం-సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రాపాక గ్రామం నుంచి 3 కి.మీ రోడ్డుకు ఎండీఆర్ నిధులు రూ.1.25 కోట్లు కేటాయించారని ఆర్అండ్‌బీ డీఈఈ పి.సాయి సతీష్ తెలిపారు. అనంతరం ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ అధికారుల ఆధ్వర్యంలో రాపాకలో జరిగిన హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈఈ జి.వీరన్నబాబు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ-నాగంపల్లి రోడ్డులోని రాఘవాపురం శివారులో నూతన సీసీ రోడ్డు పనులకు రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరితో కలిసి ఎమ్మెల్యే బత్తుల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారిద్దరినీ స్థానికులు సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే.అక్కడికి వచ్చిన మహిళల నుంచి అర్జీలను స్వీకరించారు.

పరామర్శ.. గాడాల గ్రామానికి చెందిన గరగా దొరబాబు తల్లి కనకరత్నం, సోడసాని శ్రీను తండ్రి సత్యనారాయణ, మట్ట గణేష్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బత్తుల వారి ఇళ్లకు వెళ్లి అంజలి ఘటించి, వారి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమాల్లో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

విఘ్నేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే వాసు


విఘ్నేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలితో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక నాళం భీమరాజు వీధిలోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ఎమ్మెల్యే వాసు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గత ప్రభుత్వం దేవస్థాన కమిటీలను పక్కన పెట్టేసిందని, దీంతో దేవాలయాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దేవస్థానం కమిటీలు వేయడానికి కసరత్తు చేశామన్నారు. అనంతరం కమిటీ చైర్మన్ మద్ది వెంకట నాగపూర్ణ శ్రీ సత్యనారాయణ, డైరెక్టర్లు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులందరికీ ఆయన నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన సిటీ అధ్యక్షుడు వై.శ్రీను, శెట్టి జగదీష్, బుడ్డిగ రాధ, కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు పోలీసుస్టేషన్‌కు తరలింపు

సీతానగరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పలువురు వైసీపీ నాయకులను గోకవరం పోలీసుస్టేషన్‌కు తరలించారు. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు 3కి.మీ మేర రోడ్డు వేయడానికి ఆర్అండ్‌బీ అధికారులు పనులు సోమవారం ప్రారంభిస్తారని సమాచారం రావడంతో వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో రఘుదేవపురం చేరుకున్నారు. అయితే రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో అదే సమయంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రాపాక రోడ్డు శంకుస్థాపనకు వస్తున్నారనే విషయం తెలుసుకుని ఆందోళన చేపట్టారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా వైసీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని బలవంతంగా పోలీస్ వ్యాన్ ఎక్కించారు. వీరిని గోకవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

రూ.2.30 లక్షలు అందజేత

కడియం ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తమ మిత్రుడి కుమారుని వైద్యానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. కడియం ఉన్నత పాఠశాలలో 1983-84 పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో కొంపెల్ల ప్రభాకర్ కుమారుడు శరత్‌చంద్రకు లుకేమియా వ్యాధి సోకింది. వైద్యానికి రూ.35 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ప్రభాకర్ స్నేహితులు రూ.2.30 లక్షల సేకరించారు. ఈ నగదును వారి మిత్రుడు పల్ల సత్తిబాబు నర్సరీ వద్ద అందజేశారు. కార్యక్రమంలో పల్ల సత్యనారాయణ, మార్ని సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, మహ్మద్ సర్కార్‌బాషా, కర్రి రాజు, జంగా సుబ్బారావు, టి.ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు

దివాన్‌చెరువు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకృష్ణపట్నంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది పదో తరగతి పరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని అన్నారు. విద్యార్థులంతా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. రాయుడు సూర్యసుందర్ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ అక్బర్, రావిపూడి సత్యప్రసాద్, పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు, కాపా సత్తిబాబు, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచంలో అగ్రగామిగా భారత్!

» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏపీఆర్ చౌదరి
» ఘనంగా హర్ ఘర్ తిరంగా
» జాతీయ జెండాలతో ర్యాలీలు

సీతానగరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అగ్రగామి దేశంగా భారత్ అవతరించబోతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏపీఆర్ చౌదరి అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ భారత్ ఆర్థికంగా, సైనికపరంగా ప్రపంచంలో 4వ స్థానంలో ఉందన్నారు. బీజేపీ నాయకత్వం, నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం శక్తివంతమైన దేశంగా రూపుదిద్దుకోవడం గర్వకారణమన్నారు. ముందుగా బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు జాతీయ జెండాలతో వందేమాతరం, భారత్‌మాతకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మద్దాల కొండలరావు, పాలడుగుల శ్రీవిద్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీతానగరం: బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

గోకవరం: గోకవరంలో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా యాత్ర చేపట్టారు. స్థానిక గుబ్బాలమ్మ ఆలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఈ యాత్ర కొనసాగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు యాత్రలో పాల్గొని సుమారు 150 మీటర్ల జెండాను ప్రదర్శనగా ఊరేగించారు. ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించడం, భరతమాత వైభవాన్ని చాటి చెప్పేందుకు కులమతాలకు అతీతంగా ఈ యాత్ర నిర్వహించినట్టు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 15న ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మట్టా మంగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మ, కోన వెంకటసురేష్, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో అధికారులు, కూటమి నేతలు, విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో సోమవారం సాయంత్రం జరిగిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది జాతీయ జెండా పట్టుకుని ర్యాలీగా దేశభక్తి గీతాలు ఆలపిస్తూ పాఠశాల నుంచి కంబాల చెరువు మీదుగా చిరంజీవి బస్టాండ్ సెంటర్ చేరుకుని అక్కడ నుంచి తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది కేవీఎస్ సుబ్రహ్మణ్యం, బి.రవికిరణ్, కె.సాయికృష్ణ, కె.వెంకటేశ్వర్లు, ఎస్.నాగచంద్ర, సీహెచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో ఎన్టీఆర్ విగ్రహం నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకూ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం ఆయన గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ తరువాత భారతదేశం ఎంత శక్తివంతమైన దేశమన్న విషయాన్ని ప్రపంచానికి చాటిజెప్పిన ఘనత ప్రధాని మోదీకి దక్కిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ప్రభుత్వాధికారులు కూడ గ్రామాల్లో తిరంగా ర్యాలీలు చేపడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఈ నెల 13 నుంచే తమ ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రావాడ నాగు, దుర్గారెడ్డి, బేరా వేణమ్మ, గొర్రెల త్రిమూర్తులు, ఓవీ కృష్ణ, డీవీఆర్, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, చాగంటి సాయిబాబారెడ్డి తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో నాగేంద్రప్రసాద్, ఎస్ఐ రవిచంద్రకుమార్, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం: ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల విద్యార్థుల ర్యాలీ

బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐకు వ్యతిరేకం

రాజమహేంద్రవరంలో ఐడీబీఐ బ్యాంకు ఎదుట బ్యాంకు ఉద్యోగుల ధర్నా



ఐడీబీఐ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ వద్ద ఉన్న ఐడీబీఐ 94శాతం వాటా నుంచి 61శాతం వాటాను ప్రైవేట్, విదేశీ కంపెనీలకు అమ్మే ప్రయత్నాలను విరమించుకోవాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎన్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరం దానవాయిపేటలోని ఐడీబీఐ బ్యాంకు ఎదుట ఆ బ్యాంకు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఐడీబీఐ ఉద్యోగుల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు జిల్లా బ్యాంకు ఉద్యోగులు సంఘీభావంగా పాల్గొన్నారన్నారు. బీమా రంగంలో నూరుశాతం ఎఫ్‌డీఐ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో మూలధన ఉపసంహరణ వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏఐబీవోఏ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడారు. ఐడీబీఐ బ్యాంకు ఉద్యోగులు రమేష్, కిషోర్, శివరామకృష్ణ, సూర్య, రాంబాబు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సంఘీభావం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): లాభాల బాటలో నడుస్తున్న, లక్షల కోట్ల రిజర్వులున్న ఐడీబీఐ బ్యాంకును డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం సరి కాదని రాజమండ్రి డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు.స్థానిక మోరంపూడి సెంటర్‌లోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద సోమవారం భోజన విరామ సమయంలో యూనియన్ అధ్యక్షుడు ఆర్‌జే మాథ్యూస్ ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సోమవారం జరిపిన దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావ నిరసన ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు సత్యదేవ, పీఎస్ఎన్ రాజు, జి.శ్రీనివాసరావు, వి.ఈశ్వరరావు, భరణి, జిలాని పాల్గొన్నారు.

280 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వెంకటనగరం గ్రామ పరిధిలోని లంకల్లో ఎక్సైజ్ పోలీసులు 280లీటర్ల సారా, 100కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకొని, 4200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దీనిపై నార్త్ ఎక్సైజ్ స్టేషనులో కేసు నమోదు చేశారు.

రంగంపేట: మండలంలోని మర్రిపూడి, దొడ్డిగుంట గ్రామాల్లో సోమవారం దాడులు నిర్వహించి జీలం వెంకన్నబాబు, మల్లెల నాగమణిలను అరెస్ట్ చేసి, వారి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనపరచుకున్నామని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు.

కోడూరి సంస్మరణ సభ

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి కోడూరి శ్రీరామమూర్తి చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు, గాంధేయవాది కోడూరి శ్రీరామమూర్తి ఈ నెల 5న మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆయన సాహిత్య కృషికి నివాళులర్పిస్తూ శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆరిపిరాల నారాయణరావు, రెంటాల వెంకటేశ్వరరావు, సీహెచ్ కూర్మయ్య తదితరులు పుష్పాంజలి ఘటించారు.

అశ్లీల నృత్యాలు నిర్వహించరాదు: ఎస్ఐ

బిక్కవోలు/అనపర్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చవితి ఉత్సవాల పేరుతో ఎటువంటి అశ్లీల నృత్యాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్, అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ హెచ్చరించారు. సోమవారం ఆయన బిక్కవోలు మండలం బలభద్రపురం, అనపర్తి మండలం పులగుర్త గ్రామాల్లో చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులతో వారు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు.చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా మండపాల వద్ద సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయొద్దన్నారు. మండపాల వద్ద ఘర్షణ వాతావరణం ఏర్పడే పరిస్థితుల్లో పెద్దలు జోక్యం చేసుకోవాలని సూచించారు. నిమజ్జనాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐలు సూచించారు.

మొక్కలను నాటి పరిరక్షించాలి: కలెక్టర్


మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మొక్కలను నాటడం, వాటిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పచ్చదనాన్ని పరిరక్షించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద జీటీ రోడ్డు స్థలంలో మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చదనం ఉంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్న విషయాన్ని పౌరులంతా గ్రహించాలని అన్నారు. చెట్ల పెంపకంతో కాలుష్యం తగ్గుతుదని, ప్రకృతి వైపరీత్యాలను నివారించవచ్చని అన్నారు. అన్ని రకాల రహదారులు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో విరివిగా మొక్కలు నాటాలని కోరారు. అకిరా మియావాకి పద్ధతిపై దృష్టి సారించాలని, ఈ పద్ధతిలో మొక్కలు నాటితే తక్కువ స్థలంలోనే దట్టమైన చిట్టడివి సృష్టించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో ముందుండి బాధ్యతగా పాల్గొనాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రటరీ శైలజవల్లి, ఈఈ మదర్సా ఆలీ, ఏడీహెచ్ స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాతావరణాన్ని కాపాడుకుంటేనే ఆరోగ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని కాపాడుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు అన్నారు. సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ (జెనీవా) సహకారంతో ఆంధ్రప్రదేశ్ క్లైమాట్ యాక్షన్ క్యాంపెయిన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులను (వలంటీర్లు) ఒక గ్రూపును ఏర్పాటు చేసి ఎంపిక చేసి వారికి ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్టులు, క్యాప్‌లు అందజేశారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రతి వలంటీర్ తమ పరిసర ప్రాంతంలోని పది గృహాలను దత్తత తీసుకుని వాయు కాలుష్యం, నీటి కాలుష్యం నివారణ, చెత్త వేరు చేయడం, ఒక్కసారే వాడే ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటడం వంటి పర్యావరణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ రవితేజ తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పాలచర్ల పీహెచ్‌సీ డాక్టర్ బెనడిక్ట్


సీతానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో 1 నుంచి 19 ఏళ్ల వయసున్న 10,439 మంది జనాభాకు ఈ మాత్రలు అందజేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈమాత్రలు వేస్తామన్నారు.మంగళవారం మిగిలిపోయిన వారి కోసం ఈ నెల 20న మాప్‌అప్ కార్యక్రమం నిర్వహిస్తామని డాక్టర్ బెనడిక్ట్ పేర్కొన్నారు.

పోస్టర్ విడుదల

సీతానగరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నులిపురుగు నివారణ దినం పోస్టర్‌ను ఎంపీడీవో ఎం.భారతి, ఎంఈవో స్వామినాయక్, డాక్టర్ యేసురాణి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏసురాణి మాట్లాడుతూ మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని మండలంలో అన్ని అంగన్వాడీ కేంద్రాలు, 69 ప్రభుత్వ, 76 ప్రైవేట్ పాఠశాలు, నాలుగు కళాశాలలో మొత్తం 11,368 మంది పిల్లలకు అల్‌బెండజోల్ మాత్రలు మింగించనున్నట్టు చెప్పారు. ఈ మాత్ర వేసుకోవడం వల్ల పిల్లల్లో రక్తహీనతను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనపర్తి: నులి పురుగుల నివారణ కోసం ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు అందే విధంగా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా రామవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మాత్రలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, మండలంలో 9757మందికి మాత్రలు వేయడాన్ని వైద్యులు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పులగుర్తలో నియోజకవర్గ చేనేత కార్మికుల ఆధ్వర్యం లో నిర్వహించిన కృతజ్ఞత కార్యక్రమానికి ఆయ న విచ్చేశారు. ఈ సందర్భంగా నేత కార్మికులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సందర్భంగా నేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీల రాయితీపై ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.164 కోట్లు వెచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికుల సంక్షేమ సంఘం ప్రతినిధి పేరిశెట్టి లాలయ్య, రావాడ నాగు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నేత కార్మికులు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బిక్కవోలు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధులు రూ.2 కోట్లతో కాపవరం-దుప్పలపూడి బీటీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని, త్వరలో అనపర్తి-బిక్కవోలు వరకూ కెనాల్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టనున్నారన్నారు. అనంతరం అధికారులు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి నాయకులు కొట్టు సత్తిబాబు, మణికంఠ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటానికి పాలాభిషేక దృశ్యం

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: బకాసుర రెస్టారెంట్
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: అతడు
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ(సాయికృష్ణ)	: సు ఫ్రమ్ సో
శివజ్యోతి	: సార్ మేడమ్
రాజా	: కింగ్‌డమ్
ఊర్వశి	: మహావతార్ నరసింహ
మేనక	: రాజు గాని సవాల్
రంభ	: జూనియర్
కుమారి	: ----
అప్సర	: కింగ్‌డమ్
అశోక	: కింగ్‌డమ్
వీఎస్ మహల్(నామవరం)	: మహావతార్ నరసింహ
మురళీకృష్ణ(ధవళేశ్వరం	: మహావతార్ నరసింహ
వెంకటసూర్య(కడియం)	: మహావతార్ నరసింహ
సత్యగౌరి (అనపర్తి)	: కింగ్‌డమ్
సూర్యశ్రీ (అనపర్తి)	: హరిహర వీరమల్లు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	మహావతార్ నరసింహ
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కింగ్‌డమ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మహావతార్ నరసింహ
లలితామహల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు



9వ డివిజన్‌లో ఐఎంఏ హాల్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

'గణపతి ఉత్సవాల అనుమతులకు సింగిల్‌విండో సెల్'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాల నిర్వహించుకునేందుకు అనుమతుల జారీ కోసం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సింగిల్ విండో సెల్ ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సవ కమిటీలు దీని ద్వారా అనుమతులు పొందాలని కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం పోలీస్, రెవెన్యూ, ఫైర్, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు, నగరపాలకసంస్థ విభాగాధిపతులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెండో అంతస్తులోని పట్టణ ప్రణాళిక విభాగంలో ఈనెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించేలా నిర్ణయించారు.

25 టన్నుల రేషన్ బియ్యం లారీ స్వాధీనం

» నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా పట్టివేత

దొంగల ముఠా ఆటకట్టు!

» నలుగురి అరెస్ట్ » రూ.45 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

8

'ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి' చొరవతో
సమస్యలకు మోక్షం

» 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'కు స్పందన
» నేటి సాయంత్రం 4 గంటలకు రాజమహేంద్రవరం 9వ డివిజన్‌లో సభ
» ముఖ్య అతిథిగా హాజరుకానున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
» రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు తదితర సమస్యలకు పరిష్కారం

రాజమహేంద్రవరం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రజల సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం చక్కటి ఫలితాలను ఇచ్చింది. 'అక్షరమే అండా.. పరిష్కారమే అజెండాగా' అనే నినాదంతో ఈ ఏడాది జనవరి 28వ తేదీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో శ్రీవేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో ప్రజల సమక్షంలో సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తోపాటు 9వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చండీప్రియ, పలువురు మున్సిపల్ అధికారులు, స్థానిక పెద్దలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా 9వ డివిజన్ పరిధిలో నివసించే అనేకమంది సభకు వచ్చి అపరిష్కృతంగా ఉన్న తమ ప్రాంత సమస్యలు ఏకరవుపెట్టారు. మాజీ కార్పొరేటర్ చండీప్రియ కూడా అక్కడి సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇవన్నీ విన్న ఎమ్మెల్యే వాసు కొద్దిరోజుల్లో ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధ్వానంగా ఉన్న పారిశుధ్య సమస్య అప్పటికప్పుడే పరిష్కారమైంది. విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారమైంది. వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావస్తోంది. అప్పట్లో కల్వర్టుల పేరుతో నెమ్మదిగా జరుగుతున్న పనులన్నీ పూర్తయ్యాయి. అవేకాక జేఎన్ రోడ్డు అధ్వాన పరిస్థితి చక్కబడింది. సుమారు రూ.10 కోట్లతో 32 ముఖ్యమైన పనులు పూర్తయ్యాయి. అందులో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పార్కులు ఉన్నాయి. వైసీపీ హయాంలో కోర్టు లిటిగేషన్‌తో ఆగిపోయిన ఐఎంఏ హాల్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. వేంకటేశ్వరనగర్ పార్కు కింది భాగంలో మాస్టర్ ప్లాన్‌ను మార్చేసిన సమస్య ఇంకా పెండింగ్‌లో ఉంది. దానిపై ఇటీవల కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి వేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం సాయంకాలం 4 గంటలకు సక్సెస్ మీట్ ఏర్పాటుచేసింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరుకానున్నారు.



స్త్రీశక్తికి తుది కసరత్తు!

» జీవో, మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
» బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్
» టిక్కెట్ ఇష్యూయింగ్ మెషీన్ల (టిమ్స్)లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీ టికెట్ (డబ్ల్యుఎఫ్‌టీ) బటన్
» ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ పథకం షురూ
» రాజమహేంద్రవరం- కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులకు వర్తించదు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించిన 'స్త్రీశక్తి పథకం' అమలుకు తుదికసరత్తు జరుగుతోంది. ఈమేరకు సోమవారం విజయవాడలో ఆయా జిల్లాల ప్రజారవాణా అధికారులతో ఆర్టీసీ ఉన్నతాధికారులు సమావేశమై మార్గనిర్దేశం చేశారు. తూర్పుగోదావరి జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు విధి విధానాలకు సంబంధించిన జీఓ, మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. అయితే, నాన్‌స్టాప్ సర్వీసుల్లో ఈ పథకం వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొనడంతో రాజమహేంద్రవరం-కాకినాడ మధ్య నడిచే నాన్‌స్టాప్ సర్వీసుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అనుమతించరు. అదేవిధంగా ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, సప్తగిరి, ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదని, నాన్‌స్టాప్ సర్వీసులు, స్పెషల్ బస్సులు, అంతర్రాష్ట్ర సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణం ఉండదని ప్రభుత్వం పేర్కొంది.

జిల్లాలో.. ఈ బస్సుల్లోనే ప్రయాణం..

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోలు ఉన్నాయి. ఈ నాలుగు డిపోల పరిధిలో మొత్తం 205 ఆర్టీసీ సొంత బస్సులు, 78 అద్దె బస్సులు నడుపుతున్నారు. వీటిలో ఆర్టీసీ, అద్దె బస్సులు కలిపి .. జిల్లాలో 37 ఎక్స్‌ప్రెస్‌లు, 27 ఆల్ట్రా పల్లెవెలుగు, 167 పల్లెవెలుగు బస్సులు స్త్రీ శక్తి పథకంలో మహిళలు ఉచితంగా రాకపోకలు సాగించనున్నారు. డిపోల వారీగా చూస్తే రాజమహేంద్రవరం డిపోలో 22 ఎక్స్‌ప్రెస్‌లు, 15 ఆల్ట్రా పల్లెవెలుగు, 64 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. గోకవరం డిపోలో 14 ఎక్స్‌ప్రెస్‌లు, 12 ఆల్ట్రా పల్లెవెలుగు, 30 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. కొవ్వూరు డిపోలో ఒక ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. 42 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. నిడదవోలు డిపోలో కేవలం 31 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ఇక స్త్రీశక్తి పథకం అమలులో ఎటువంటి గందరగోళానికి తావులేకుండా టిక్కెట్లు జారీచేసే మెషీన్ (టిమ్స్)లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీటిక్కెట్ (డబ్ల్యుఎఫ్‌టీ)పేరిట ప్రత్యేకంగా ఒక బటన్ ఏర్పాటు చేశారు. బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడానికి ఈ ఒక్క బటన్ ప్రెస్ చేస్తే చాలు ప్రింటెడ్ టిక్కెట్ బయటకు వస్తుంది. పురుషులకు మాత్రం గతంలో మాదిరిగానే ప్రయాణ దూరానికి అనుగుణంగా ఛార్జీలను నిర్దేశించి టిక్కెట్లు ఇస్తారు.


రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో సిద్ధమవుతున్న బస్సులు

టిక్కెట్లపై స్త్రీశక్తి.. జీరో టిక్కెట్ ముద్రణ

ముందు ఊహించినట్టుగానే మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్ జారీ చేస్తారు. అయితే దీనిలో చిన్న మార్పులు చేశారు. బాలికలు, స్త్రీలకు ఇచ్చే స్త్రీ శక్తి టిక్కెట్లపై తాము ప్రయాణించే దూరానికి టిక్కెట్ చార్జీ ఎంతవుతుందో ఆ మొత్తం ముద్రించి ఉంటుంది. దానికింద ప్రభుత్వ రాయితీ అంతే మొత్తం పేర్కొంటారు. చివరన టిక్కెట్ చార్జీ జీరోగా చూపిస్తారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి తాము ఎంత లబ్ధిపొందామనేది మహిళలు తెలుసుకుంటారని భావిస్తున్నారు.

అర్హులైన వారందరికీ జీరో ఫేర్ టిక్కెట్..



వయస్సుతో నిమిత్తం లేకుండా అర్హులైన అర్హులైన ప్రతి బాలిక, మహిళ, ట్రాన్స్‌జెండర్ స్త్రీశక్తి పథకంలో జీరో ఫేర్ టిక్కెట్ ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం సాగించవచ్చు. టిక్కెట్ తీసుకునే సమయంలో ఆర్టీసీ సిబ్బందికి తగిన గుర్తింపుకార్డు చూపించి జీరో టిక్కెట్ పొందాలి. భార్యాభర్తలు, పిల్లలు ప్రయాణించే సమయంలో వారికి వేర్వేరుగా టిక్కెట్లు ఇవ్వడం జరుగుతుంది. బాలికలు, మహిళలకు జీరో టిక్కెట్, బాలురు, పిల్లలకు ప్రయాణ చార్జీతో కూడిన టిక్కెట్ జారీచేస్తాం. టిక్కెట్ల జారీకి సంబంధించి ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఆర్టీసీ సిబ్బందికి ఇప్పటికే తగిన అవగాహన కల్పించాం. శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ పథకం అమలుచేస్తాం. ఆ రోజు ఏ సమయం నుంచి అనేది మార్గదర్శకాల మేరకు ఉంటుంది.

- వైఎస్ఎన్ మూర్తి, తూర్పుగోదావరి జిల్లా ప్రజారవాణా అధికారి



లక్ష్మీలావణ్యకు ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కృషి పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా విజయమే : కలెక్టర్

ఓపెన్ స్కూల్ టెన్త్‌లో ప్రథమ శ్రేణిలో పాసైన దివ్యాంగురాలికి అభినందన

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కృషి పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా విజయం సాధించవచ్చని, దీనికి తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు లక్ష్మీ లావణ్య వంటి వారే ప్రత్యక్ష సాక్షమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఇటీవల జరిగిన ఏపీ అమరావతి ఓపెన్‌స్కూల్ (సార్వత్రిక పీఠం) పదో తరగతి వార్షిక పరీక్షల్లో 500 మార్కులకుగాను 345 మార్కులు (69 శాతం) సాధించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. దీనికి సంబంధించిన ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని లక్ష్మీ లావణ్యకు కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. ఆ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లావణ్య చదువు కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. ఆమెకు ప్రభుత్వం ద్వారా ప్రతి నెలా రూ.15వేల పెన్షన్ అందించనున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షించిన పీ-4 కార్యక్రమంలో ఆటువంటి కార్యక్రమాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. తనకు అన్నివిధాలా అండగా నిలిచి ప్రోత్సాహం అందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్ ప్రశాంతి, డీఈవో వాసుదేవరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

వైద్య సేవలు మరింత మెరుగుపడాలంటే..

ఈ పోస్టులివ్వండి సారూ..

» నెఫ్రాలజిస్ట్, కార్డియాలజిస్ట్ పోస్టులు ఖాళీ.. ఔట్‌సోర్సింగ్‌లో రేడియాలజిస్ట్ సేవలు
» పిడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీకి వైద్యుల నియామకమూ అవసరమే
» వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడు రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో కీలకమైన ప్రధాన విభాగాలకు వైద్యుల కొరత వేధిస్తోంది. మెడికల్ కాలేజీకి జీజీహెచ్ అనుసంధంగా ఉన్నా కొన్ని కీలకమైన విభాగాలకు వైద్యులను నియమించకపోవడం వైద్యసేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా కార్డియాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యవసర వైద్యసేవల్లో కార్డియాలజిస్ట్ పాత్ర ఎంతో కీలకం. ఇటీవలి కాలంలో గుండె సంబంధిత వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్నవారు పెద్దసంఖ్యలోనే ఉంటున్నారు. వీరికి జనరల్ మెడిసిన్ వైద్యులే గుండె సంబంధిత వైద్యం చేస్తున్నారు. గుండె నెప్పితో వస్తున్న వారికి ఈసీజీ, 2డీ ఎకో వంటి టెస్టులు రాసి, వాటి రిపోర్టులు చూసి మందులు రాసి పంపేస్తున్నారు. రిపోర్టుల్లో లోతైన పరిశీలన, ఇతర కారణాలను వారు పరిగణలోకి తీసుకోవడంలేదు. దీంతో కార్డియాక్ వైద్యసేవలు తూతూ మంత్రంగానే జరుగుతున్నాయి. అలాగే కీలకమైన కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్యం చేసే నెఫ్రాలజిస్ట్ ఇక్కడ లేరు. కిడ్నీ సమస్య వస్తే ఎవరికి చూపించుకోవాలో తెలియని అయోమయం జీజీహెచ్‌లో ఉంది. సర్వరోగాలకు ఒకటే మంత్రం అన్నట్టు అందరూ జనరల్ మెడిసిన్ వైద్యుల వద్దకే వెళ్లాల్సి వస్తోంది. మరోపక్క రోగ నిర్ధారణలో అత్యంత కీలకమైన రేడియాలజిస్ట్ సేవలను ఔట్‌సోర్సింగ్‌లో మాత్రమే అందుతున్నాయి. శాశ్వత రేడియాలజిస్ట్ లేకపోవడంతో సమయానికి రిపోర్టులు అందడంలేదనే అసంతృప్తి రోగులు, వారి కుటుంబీకుల్లో వ్యక్తమవుతోంది. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఆల్ట్రా సౌండ్ వంటి పరీక్షల్లో రేడియాలజిస్ట్ నివేదిక వైద్యుడికి అత్యంత కీలకం అన్న విషయం తెలిసినా శాశ్వత రేడియాలజిస్ట్ నియామకంపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారించడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే జీజీహెచ్‌లోని పీడియాట్రిక్ విభాగంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వీటికి సంబంధించిన విభాగాలను మంగళవారం ప్రారంభిస్తున్నారు. అయితే పిడియాట్రిక్ విభాగంలో వైద్యులున్నా సూపర్‌స్పెషాలిటీ వైద్యులు ప్రస్తుతం లేరు. కొత్తగా నియామకం చేపట్టాలి. అప్పుడే ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు వైద్యసేవల్లో నాణ్యత పెరగాలంటే ప్రధాన విభాగాల్లో వైద్యులు, సాంకేతిక నిపుణులను నియమించాల్సి ఉంది.

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన ఇలా..

రాజమహేంద్రవరం అర్బన్/ రంగంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 7.30 గంటలకు మంగళగిరి నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి 10 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారు. అనంతరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటికి వెళతారు. అక్కడి నుంచి బయలుదేరి 10.25 గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకుని ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాకులో కొత్తగా ఏర్పాటుచేసిన ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ -1, ఎస్ఎన్‌సీయూ-2, పీఐసీయూ విభాగాలను ప్రారంభిస్తారు. తర్వాత వడిశలేరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొంటారు. సీసీ రోడ్డు శంకుస్థాపన, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణీలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి రాజానగరం చేరుకుని పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 3 గంటలకు జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల సముదాయాన్ని ప్రారంభించి, సుశ్రుత ఆడిటోరియంలో జరిగే ప్రపంచ అవయవదాన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు కొవ్వూరు చేరుకుని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నివాసానికి వెళ్లి, ఆ తర్వాత మంగళగిరికి బయలుదేరి వెళతారు.



హర్‌ఘర్ తిరంగా మెగా ప్రచార ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జాతీయ సమైక్యతను చాటేలా హర్‌ఘర్ తిరంగా : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. హర్‌ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం వై.జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ ఆర్ఎంసీ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులతో మెగా ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ముందుగా పోస్టర్‌ను కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. యువతలో దేశభక్తి పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగా, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి కార్యక్రమాలు అమలుచేస్తున్నట్టు పేర్కొన్నారు. జేసీ చిన్నరాముడు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజ వల్లి పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యజ్ఞం...

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలననుసరించి, దేశభక్తి భావాన్ని ప్రతి పౌరునిలో ప్రేరేపించేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆగస్టు 15 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. హర్‌ఘర్ తిరంగా కేవలం ఒక కార్యక్రమం కాదని, ప్రతి మనసులో జాతీయ గౌరవాన్ని నాటే ప్రజా సంకల్ప యజ్ఞమని అన్నారు. కలెక్టరేట్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంపై అధికారులకు సోమవారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయ స్థాయి వరకు జాతీయ పతాకాన్ని గౌరవించే చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 157 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తోందని, అర్జీలను నిర్దీత గడువులో నాణ్యతతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 157 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను ఓర్పుతో విని మర్యాదపూర్వకంగా స్పందించాలన్నారు. పరిష్కరించగల అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించలేని వాటికి కారణాలు వివరించి అర్జీదారులకు తెలియజేయాలన్నారు. మండలాల వారీగా రోజువారీగా ఫిర్యాదుల తీరును సమీక్షించాలన్నారు. గ్రీవెన్స్ ఎక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీపై ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. సోమవారం నిర్వహించిన అర్జీలలో రెవెన్యూకి సంబంధించి 71, పంచాయతీరాజ్‌కి సంబంధించి 43, విద్యుత్‌శాఖకు సంబంధించి 7, విద్యారంగానికి చెందినవి 5, పోలీస్, పురపాలక శాఖలకు చెందినవి 31 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా కోరుకొండ మండలం కాపవరం గ్రామ పంచాయతీ గణేష్ నగర్ కాలనీవాసులు సుమారు 60 మంది బైపాస్ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.


జిల్లా కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు తదితరులు


జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

ఎస్పీ గ్రీవెన్స్‌కి 31 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 31 ఫిర్యాదులను జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. వారి సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషను బాధ్యులకు ఫోన్ చేసి తగు ఆదేశాలిచ్చారు. చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఎల్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

'విధులు బహిష్కరిస్తాం'

గోపాలపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు విధులు బహిష్కరిస్తున్నట్టు శ్రీసత్యసాయి మంచినీటి ప్రాజెక్టు మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన నోటీసులు విడుదల చేశారు. డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఆర్‌వోబీ

● రాత్రిపూట లైట్లు వెలగక ప్రజలు, వాహనదారుల ఇక్కట్లు
● 'ఉభయ' జిల్లాలకు ఇదే ప్రధాన మార్గం ● పట్టించుకోని అధికారులు



నిడదవోలు నుంచి సమిశ్రగూడెం వైపు వెళ్లే మార్గంలో వెలగని లైట్లు

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రిపూట బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న హైమాస్ట్ లైట్లు వెలగక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల వాసులకు ప్రధాన మార్గం ఇదే. దీని గుండా ప్రతినిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇదేదో జిల్లాలోని మారుమూల ప్రాంతమనుకుంటే మీరు పొరపాటు పడినట్టే.. జిల్లాలోని అతి ముఖ్యమైన మునిసిపాలిటీల్లో ఒకటైన నిడదవోలు పట్టణ పరిధిలో ఈ పరిస్థితి ఉంది. వివరాల్లోకి వెళితే నిడదవోలు పట్టణం, మేజర్ పంచాయతీ సమిశ్రగూడెం మధ్య ఉన్న





సమిశ్రగూడెం నుంచి నిడదవోలు వెళ్లే వైపు ఇలా...

పైకి తిరిగిపోయి ఉన్న లైటు

ఆర్‌వోబీ ఎంతో కీలకమైన ప్రయాణ మార్గం. అటు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెళ్లాలన్నా, రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం రావాలన్నా... అలాగే నర్సాపురం నుంచి నిడదవోలు రావాలన్నా... నిడదవోలు నుంచి నర్సాపురం వెళ్లాలన్నా ఈ ఆర్‌వోబీయే గతి. అలాంటి ఈ బ్రిడ్జిపై నిడదవోలు నుంచి సమిశ్రగూడెం వైపు 11 లైట్లు, సమిశ్రగూడెం నుంచి నిడదవోలు వైపు 11 లైట్లు ఏర్పాటు చేశారు. అయితే అందులో ఒక్కటంటే ఒక్క లైటు కూడా వెలగడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి, లైట్లు వెలిగేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా'



నియామక పత్రాన్ని అందుకుంటున్న సొసైటీ చైర్‌పర్సన్ సుబ్బరాజు, సభ్యులు

దేవరపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించటానికి కృషి చేస్తానని సొసైటీ చైర్‌పర్సన్ పెనుమత్స సుబ్బరాజు పేర్కొన్నారు. యర్నగూడెం శ్రీవేణుగోపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బరాజు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఉన్న యర్నగూడెం, కృష్ణంపాలెం, సంగాయిగూడెం, గాంధీనగరం, సూర్యనారాయణ పురం గ్రామాల్లోని రైతులకు అన్నివిధాలా సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా తనను నియమించిన సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఉషారాణి నూతనంగా ఎంపికైన చైర్‌పర్సన్ పెనుమత్స సుబ్బరాజు, సభ్యులు యండ్రప్రగడ శ్రీధర్, పుట్టా హరిప్రసాద్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మండా పెదబాబు, సొసైటీ చైర్‌పర్సన్‌లు ఆండ్రూ అనిల్, ఉప్పులూరి రాంబాబు, కరుటూరి శ్రీరామ్మూర్తి, గన్నమని గోపాలకృష్ణ, పోడూరి వెంకటరత్నం, గద్దే వెంకట రామారావు, గద్దే శ్రీనివాస్, టీడీపీ నేతలు బొల్లిన విజయ భాస్కర్, గన్నమని హరికృష్ణ, దోనెల్లి గంగాధర్, బళ్లా సూర్యచక్రం, తదితరులు పాల్గొన్నారు.

డివిజినల్ పీజీఆర్ఎస్‌కు 26 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 26 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఫిర్యాదులు నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు వారంలో రెండు రోజులు ఆయా శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చెక్కు అందజేత



మార్కొండపాడులో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

చాగల్లు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మార్కొండపాడులో ఇటీవల పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు అదే గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ సుంకవల్లి వెంకటరత్నం అనే వ్యక్తి మృతిచెందాడు. దీంతో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ద్వారా మంజూరైన రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అతని భార్య పద్మావతికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు చేతుల మీదుగా సోమవారం అందజేసారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నాయకులు సుంకల్లి రమేష్, బండి శ్రీను, మద్దిపాటి వీరరాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన బూత్‌ల ఏర్పాటుకు సహకరించాలి : ఆర్‌వో



తహశీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ భాగ్యవతి

గోపాలపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఓటర్ల పరిమితికి మించిన ప్రదేశాల్లో నూతన బూత్‌ల ఏర్పాటుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యవతి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చివటంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చివటంలో సోమవారం విద్యార్థులు, అధికారుల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ చేయించారు. అనంతరం స్థానిక పంచాయతీ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవీఎస్ఎన్ సత్యనారాయణ, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొవ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (2025-26) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.సునీత తెలిపారు. కళాశాలలో బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ కంప్యూటర్స్ సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ఉన్నాయన్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్‌లు, 27 న సీటు అలాట్‌మెంట్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 28వ తేదీ నుంచి ఫస్ట్ ఇయర్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 08813- 297035, 9391037215 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వీబీజీ వర్మ, డాక్టర్లు, సిబ్బంది

తాళ్లపూడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు రండి టీ తాగుతూ .. మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీబీజీ వర్మ పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయ పోరాటానికి అవసరమైన ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి ఉద్యోగుల బకాయిలు ప్రతి ఉద్యోగి సర్వీసు రిజిస్టర్‌లో నమోదు చేసి బాండులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సీనియర్ కామ్రేడ్ ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి పార్టీలు ఇచ్చిన హామీ ప్రకారం ఐఆర్ వెంకటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హారికా గుప్త, దుర్గా భవాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే జరిమానా : ఎస్‌ఐ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రవికుమార్

ఉండ్రాజవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను మితిమీరిన వేగంతో నడిపితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ డీ. రవికుమార్ హెచ్చరించారు. సోమవారం పాలంగిలోని తణుకు-ఉండ్రాజవరం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లైసెన్సులు, హెల్మెట్లు లేనివారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పేదప్రజల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో ఐ.పంగిడికి చెందిన కోమటి శివకుమార్‌కు మంజూరైన రూ. 2,00,000 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికైనా కష్టం ఉందంటే సీఎం, డిప్యూటీ సీఎం వెంటనే స్పందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, పొట్రు సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి : మద్దిపాటి



విజయవాడలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

గోపాలపురం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లవేళలా సేవలందించేందుకు నియమించిన చైర్‌పర్సన్‌లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండల అధ్యక్షులు కొర్లపాటి రాము, ఆండ్రూ అనిల్, తాతిన సత్యనారాయణ, లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని 17 టీఎస్‌ఈఎస్‌లకు ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్‌పర్సన్‌లు ఎమ్మెల్యేను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

కొవ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం పైడిమెట్ట ఎత్తిపోతల పథకం స్టేజ్-1లో కాలిపోయిన 75 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని ఆ పథకం ఉపాధ్యక్షుడు గన్నిన సత్తిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. 2025 జూలై 27వ తేదీన తాళ్లపూడి మండలం పైడిమెట్ట ఎత్తిపోతల పథకం రైతుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ స్టేజ్- 1లో 750 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందులో ఎత్తిపోతల పథకం డైరెక్టర్ మండా గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

● నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యుడు గంగాధర్



ఎంపీడీవోకు నివేదిక అందిస్తున్న డాక్టర్ గంగాధర్

నల్లజర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని నల్లజర్ల ప్రాథమిక ఆసుపత్రి వైద్యుడు గంగాధర్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని అన్నిగ్రామాల్లో గల విద్యాసంస్థలకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో 19 సంవత్స రాల లోపు వయస్సు కలిగిన ప్రతి విద్యార్థికి ఈ మాత్రలు మింగించాలన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 89 విద్యాసంస్థల్లో 14 వేల 148 మంది విద్యార్థులకు మాత్రలు వేసే ప్రణాళిక రూపొందించినట్టు పేర్కొన్నారు. అనంతరం నివేదికను ఎంపీడీవో సింహాద్రిరావు, ఎంఈవో సత్యనారాయణకు అప్పగించారు.

ఉండ్రాజవరం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ సృజన పేర్కొన్నారు. ఈనెల 12తేదీన నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బందికి సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు, అం గన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు విధిగా మాత్రలు వేయించాలని చెప్పారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కే. ఆంజనేయశర్మ, వైద్య సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించి తాళ్లపూడి, మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వైద్యసిబ్బంది డాక్టర్ హారికాగుప్త, డాక్టర్ దుర్గా భవాని, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సుచందన తెలిపా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశంలో 30 శాతం మంది పిల్లలు నులిపురుగుల వల్ల కలిగే వివిధ రకాల వ్యాధులతో బాధ పడుతున్నారన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఆరునెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు వేయించాలని తెలిపారు. తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ సెంటర్లలో 6,527 విద్యార్థు లకు ఈ మాత్రలు అందజేస్తామన్నారు. మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 3515 మంది విద్యార్థులు ఉన్నారని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. పెనకనమెట్టకి చెందిన కాకులపాటి గంగారత్నం, సతీష్‌బాబుకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమయ్యింది. వీరికి బాబు, పాప ఉన్నారు. కాగా, కొంతకాలంగా మద్యానికి బానిసైన సతీష్‌బాబు భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనెల పదో తేదీన సతీష్‌బాబు తన భార్య కలిసి దేవరపల్లిలోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి వచ్చిన తర్వాత భార్యతో ఘర్షణపడి కొట్టాడు.దీనిపై గంగారత్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ ఎస్‌ఐ తెలిపారు.

25 టన్నుల రేషన్ బియ్యం లారీ స్వాధీనం

● నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా..

రాజానగరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అధికారుల కళ్లు కప్పి గుట్టుచప్పుకు కాకుండా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు మార్గమధ్యంలో స్వాధీనం చేసుకున్నారు. నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు రవాణా చేస్తుండగా విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారుల సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ఈ తనిఖీలో 25 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుబడినట్టు రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు చెప్పారు. అయితే ఇటీవల రాజానగరం మండలం పాలచర్ల సమీపంలోని చెరుకూరి క్రషర్ వద్ద కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ జూలై నెలలో 6ఏ కేసులో రిలీజ్ చేసిన బియ్యంగా సంబంధిత యజమాని నల్లజర్ల గ్రామానికి చెందిన మద్దు సత్యనారాయణ చెబుతున్నాడని, ఇందుకు సంబంధించిన పత్రాలు సమర్పించారన్నారు. దీనిపై కాకినాడ జిల్లా అధికారులను సంప్రదించి నిర్ధారించామన్నారు. అయితే ఈ వ్యవహారంలో రికార్డులు సమగ్ర పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు 6ఏ కేసును నమోదు చేశామని, రికార్డు పరిశీలన నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, పౌర సరఫరాలు వారికి నివేదిక సమర్పించనున్నట్టు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.11,50,000 కాగా, లారీ విలువ రూ.10 లక్షలుగా అంచనా వేశామని, కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ వంటపాటి సురేంద్రను కూడా విచారించామన్నారు. ఈ తనిఖీల్లో రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ తహశీల్దార్, సహాయ పౌరసరఫరాల అధికారి, రాజమహేంద్రవరం, మండల సప్లై అధికారి, రాజానగరం, రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులు, తూనికలు, కొలతశాఖ అధికారులు, వీఆర్వోలు, పాలచర్ల టెక్నికల్ అసిస్టెంట్, పౌరసరఫరాల కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

11 ప్రాథమిక సహకార

సంఘాలకు త్రిసభ్య కమిటీలు

పెరవలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 ప్రాథమిక సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తీపర్రుకు కంటిపూడి సూర్యనారాయణ, కానూరుకు వాకలపూడి వీర్రాజు, కాపవరానికి నందిప శ్రీనివాస చక్రవర్తి, మల్లేశ్వరానికి మేడిచర్ల మాణిక్యాల రావు, అన్నవరప్పాడుకు వి. వెంకట నాగేశ్వర రావు, ఖండవల్లికి భూపతిరాజు రవి వర్మ, ముక్కామలకు వేండ్ర వెంకట రామ్మూర్తి, కాకరపర్రుకు పెన్మత్స వెంకట పతి వర్మ, పిట్టలవేమవరానికి కర్రి శ్రీనివాసరెడ్డి, అజ్జరానికి దేవ సోమ నాగ పవన్ కుమార్, కొత్తపల్లికి సలాది సత్యనారాయణ, నూతన చైర్మన్‌లుగా నియమితులయ్యారు. వీరిని మండల కూటమి నాయకులు అతికాల శ్రీను, బొడ్డు రామాంజనేయులు, పిప్పర రవికుమార్, అబ్బిశెట్టి సత్తిరాజు, సలాది శ్రీహరి, సలాది కృష్ణమూర్తి, నల్ల సురేంద్ర, రాజేంద్రప్రసాద్, శేషగిరిరావు, తదితరులు అభినందించారు.

దొంగల ముఠా ఆట కట్టు

నలుగురి అరెస్ట్, రూ.45 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలను వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్‌మండలం కొంతమూరు పంచాయతీ భవానీ పురానికి చెందిన గరిమెళ్ల పవన్‌శర్మ తన కుటుంబంతో గత నెల 15న శ్రీశైలం వెళ్లారు. 20న తిరిగి వచ్చే సరికి గేటు, తలుపు, బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.50 కిలోల వెండి వస్తువులు దోపిడీకి గురయ్యాయి. శర్మ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. కొంతమూరు సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి హరీశ్ గ్యాంగ్ ఆ దొంగతనం చేసినట్టు గుర్తించారు. దర్యాప్తు ముమ్మరం చేసి ఖచ్చితమైన సమాచారంతో హరీశ్, అదే ప్రాంతానికి చెందిన మోర్త వెంకటేశ్ (వెంకీ), ఇంద్రపాలేనికి చెందిన తణుకు దుర్గాప్రసాద్ (సూర్య), తొర్రేడు టిడ్కోగృహ సముదాయానికి చెందిన బండి ధర్మరాజు (గాబ్రియెల్)ను సీఐ వీరయ్య గౌడ్ బృందం అరెస్టు చేసిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అశోక్, రాజేశ్‌ని అరెస్టు చేయాల్సి ఉందని ఆయన వెల్లడించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమిశ్రగూడెం వద్ద సోమవారం సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన ఓ మహిళ మృతదేహం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ నుంచి కొట్టుకు వస్తుండగా స్థానికులు గుర్తించి ఒడ్డుకు తీశారు. దీనిపై సమిశ్రగూడెం ఎస్‌ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బియ్యం బస్తాలు చోరీ

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటకూటేశ్వరంలోని గోడౌన్ల వద్ద ఆదివారం రాత్రి 100 కేజీలు ఉండే రెండు బియ్యం బస్తాలను వాచ్‌మెన్ దొంగిలించుకుపోతుండగా గోడౌన్‌కు సంబంధించిన వ్యక్తులు పట్టుకున్నారు. దీనిపై సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీసీఐఎల్‌తో నన్నయ ఎంవోయూ

● నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న అధికారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉష) పథకంలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసే ల్యాబ్స్, సాంకేతిక సహకారం నిమిత్తం టెలీ కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్)తో ఎంవోయూ కుదుర్చుకున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం వీసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, టీసీఐఎల్ ప్రతినిధి ఆదిత్య అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈ ఎంవోయూలో ప్రధానంగా డిజిటల్ కంటెంట్ అభివృద్ధి, వ్యాప్తి చేస్తూ 24 కోర్సులకు ఈ-కంటెంట్‌తో సహా అధిక నాణ్యత డిజిటల్ అభ్యాసన వనరులను రూపొందించడానికి మూక్ లెక్చర్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేయడానికి సహకరిస్తారన్నారు. విశ్వవిద్యాలయంతో బాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులకు నైపుణ్యాలను వృద్ధి చేయడానికి స్వయం, మూక్ వంటి జాతీయ వేదికల ద్వారా డెలివరీని సులభతరం చేయవచ్చునని అన్నారు. అలాగే స్మార్ట్ లెర్నింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇంటరాక్టివ్ బోర్డులు, కంప్యూటర్ ప్రయోగశాలలు, హైస్పీడ్ వైఫై కనెక్టివిటీతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేస్తారని చెప్పారు. పాఠ్యాంశాలు, సహపాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మిశ్రమ అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత, కంటెంట్ సృష్టిని ప్రోత్సహిస్తారన్నారు. ఇంకా దీని ద్వారా కలిగే అనేక ప్రయోజనాలను వివరించారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ డిమాండ్‌లను తీర్చడానికి లైఫ్‌సైన్సెస్, జియో సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ, వ్యవసాయశాస్త్రాలతో సహా వివిధ విభాగాల్లో కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ అప్లికేషన్‌లను ఏకీకృతం చేయడానికి వీలవుతుందని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, పీఎం ఉష కోఆర్డినేటర్ కే.రమణేశ్వరి, ప్రాజెక్టు మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఆచార్య కే.శ్రీరమేష్, ఆచార్య డీ.జ్యోతిర్మయి, అధ్యాపకులు వీ.పెర్సిస్, పీ.విజయనిర్మల పాల్గొన్నారు.